ఆదివారం
ప్రజాశక్తి
మే 25, 2003

నిత్య నూతనం ఎవరెస్ట్ ఆరోహణం

హ్యాపీ బర్త్‌డే

(25-5-2003 నుండి 31-5-2003 వరకు)

ఎ. అరుణ్‌కుమార్
3సం॥, 25. 5. 2000
పుష్పలత-కృష్ణ
ఘట్‌కేసర్- రంగారెడ్డి

బి.ప్రవల్లిక
1సం॥ మే, 2002
అనూరాధ-రామరాజు
దేవరుపల్లి-విశాఖపట్నం

డి. సాయి గీతిక
4సం॥, 26. 5. 1999
భగీరథి- అప్పలస్వామి
మాధవధార- విశాఖపట్నం

యాదగిరి
2సం॥, మే, 2001
సుగుణ- శ్రీనివాసులు
పాదలపల్లి- చౌటేపల్లి



శివదుర్గ
2సం॥, 27. 5. 2001
సంధ్యారాణి- రవీంద్రబాబు
పోచవరం- ఖమ్మం

వి.ఎస్. నూకరాజు
మంగ- వెంకట్‌రావు
సాలూరు- విజయనగరం

టి. సాయిరాం
2సం॥, 28.5.2002
పుష్ప- సత్యనారాయణ
ఇంద్రపాలనగరం- నల్లగొండ

షేక్ మెహరున్నీసా
3సం॥, 29. 5. 2000
మాచర్ల-గుంటూరు



శ్రీజ
1సం॥, 29. 5. 2002
పద్మ-బుచ్చిరెడ్డి
ఎస్ఆర్ నగర్-హైదరాబాద్

రాహుల్
1సం॥, 29.5.2002
రమణి-రాజన్
తెనాలి- గుంటూరు

శీలం ప్రవల్లిక
1సం॥, 31.5.2002
సౌజన్య-రామప్రసాద్
కపిలేశ్వరపురం- తూ॥గో

మనలో మాట

బ్రహ్మవిద్యలు

ఒక పట్టాన అర్థంకాని దాన్ని బ్రహ్మపదార్థం అంటాం. ఆ కోవలోనివే బ్రహ్మరాత, బ్రహ్మవిద్య, బ్రహ్మచెవుడు వగైరాలు. బ్రహ్మరాతలో కొందరు సుప్రసిద్ధులుంటారు. తాము రాసింది తామే చదువుకోలేరు. డాక్టర్లు, జర్నలిస్టులు ఎట్సెట్రా ఈ కేటగిరిలోకి వస్తారు. డాక్టర్లలో కొందరుంటారు. వారు అక్షరాలు రాయరు. పెన్నుతో ఏదో గిలికేస్తారు. అయినా క్లినిక్ ఎదురుగా ఉన్న డ్రగ్గిస్టుకు చప్పున అర్థం అవుతుంది. మరో మందుల షాపుకు వెళ్తే వాడు చీటీ చూసి తలగోక్కుంటాడు. అటుఇటూ తిప్పి అర్థంకాలేదు పొమ్మంటాడు. ఇదంతా చూసి క్లినిక్ ఎదురుగా ఉన్న డ్రగ్గిస్టుకు డాక్టర్‌తో ఏదో కనెక్షన్ ఉందని సందేహరాయుళ్లు అంటుంటారు. లోగుట్టు పెరుమాళ్లకెరుక. అందుకని వదిలేద్దాం. బ్రహ్మరాత రాసే జర్నలిస్టులుంటారు. వారికి బ్రహ్మాండమైన సౌలభ్యం ఉంది. తప్పేదయినా దొర్లితే నేరం నాది కాదు కంపోజిటర్‌ది అని అంటారు. చచ్చుపుచ్చు రాతలు రాసి పాండిత్యం ప్రదర్శిస్తుంటారు. సభలు, సమావేశాలకు వెళ్లేవారికి కొందరు వాగ్బ్రహ్మలు తగుల్తుంటారు. వారేం మాట్లాడినా అది బ్రహ్మపదార్థమే. వారి ప్రసంగాలకు ప్రతిపదార్థం చెప్పొచ్చు. ఎటొచ్చీ భావమే అంతుబట్టదు. ఇలాంటి కేసుల్లో కవి హృదయం అర్థం కాలేదని సరిపుచ్చుకోవాలి. ఇప్పుడంటే తగ్గింది కాని వెనకటికి ఇలాంటి సినిమాలకే అవార్డులొచ్చేయి. ఆ సినిమాలు చూసిన విజ్ఞులు తేలుకుట్టిన దొంగల్లా కిక్కురుమనకుండా ఉండిపోవాలి. తత్వం బోధపడిన తాపసి భంగిమ ధరించాలి. లేదంటే ఉట్టి పుణ్యానికి అభాసుపాలవుతారు. ఎవరైనా సినిమా అర్థంకాలేదంటే అలాగా పాపం అంటూ జాలి చూపాలి. సినిమా తీసిన డైరెక్టర్ కూడా ఊహించని విధంగా ఆకాశంలో చూపులు నిలిపి విశ్లేషణ గుప్పించాలి. ఆ తర్వాత కూడా వాడు మన ఎదురుగా నిలబడి ఉంటే చల్లగా జారుకోవాలి. సినిమాలే కాదు ఇలాంటి కవిత్వమూ మన దుంపతెంచవచ్చు. ఇలాంటి కవిత్వానికే ప్రతిష్టాత్మక అవార్డులూ రావచ్చు. పుస్తకం పుచ్చుకొని దీనికి అర్థం చెప్పండి మాష్టారూ అంటూ ఆ కవిగారి ఇంటికి వెళ్లరాదు.

ఇదంతా ఒక ఎత్తయితే అప్పులిచ్చే కంపెనీలది మరో ఎత్తు. ఒకటికి పదిసార్లు తిప్పించుకొని, సవాలక్ష ప్రశ్నలు సంధించి ఒక సుమూహర్తంలో అప్పు మంజూరయిందని సెలవిస్తారు. మానవమాత్రుడికి కన్పించని అక్షరాలతో పేజీలకు పేజీలున్న డాక్యుమెంట్ మన ముందుంచుతారు. పూర్తిగా చదువుకొని, మనస్ఫూర్తిగా షరతులకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు పెట్టమని చెప్తారు. ఆ అక్షరాలు చూసి కళ్లు బైర్లు కమ్మేస్తుంటే.. చదివేశారు కదా.. అంటూ ఎక్కడెక్కడ సంతకాలు చేయాలో మార్కు చేస్తారు. అప్పు పుచ్చేసుకొని ఇంటికొచ్చినా ఆ డాక్యుమెంట్‌లో ఏమి రాసుందో తెలియక ఒకటే బెంగ. ఇప్పుడు ప్రభుత్వాలు కూడా అదే విద్యను ప్రదర్శిస్తున్నాయి. ఎలక్ట్రిసిటీ బిల్లులే తీసుకోండి స్లాబ్‌లు, టాక్సులు అంటూ తికమకపెట్టేస్తారు. ఏ స్లాబ్ ఎలా మారుతుందో ఎప్పుడు మాడు పగులుతుందో తెలియదు. ప్రయివేట్ టెలిఫోన్ ఆపరేటర్లు, సెల్యులార్ ఆపరేటర్లు ఈ విషయంలో నిష్ణాతులు. రోజుకో పథకం ప్రకటిస్తారు. ఒకదాన్ని అర్థం చేసుకొనే లోపలే మరొకటి ప్రవేశపెడ్తారు. ఒకరోజు రేటు తగ్గిందంటారు. మరోరోజు రేటు పెరిగిందంటారు. లక్షలు ఖర్చుచేసి పత్రికల్లో వాణిజ్య ప్రకటనలు చేస్తారు. ఫుల్‌పేజీ ప్రకటన అయినా ఒక్కముక్క కూడా అర్థంకాకుండా నేర్పు చూపెడ్తారు. ఫలానా ఛార్జీ తగ్గినా ఫలానా ఛార్జి పెరిగింది చూసుకోలేదా అంటూ మన జేబులు ఖాళీ చేస్తారు. ప్రయివేట్ కంపెనీలు ఇంతేలే అని సరిపెట్టుకొందామంటే బిఎస్ఎన్ఎల్ కూడా నేనేమీ వెనకబడలేదంటూ తయారయింది. అదీ రోజుకో పథకం ప్రకటిస్తోంది. గందరగోళంలో ముంచేస్తోంది. ఏం చేస్తాం... ఆ శాఖ మంత్రిగారు పూర్వాశ్రమంలో పాత్రికేయుడాయే. చచ్చుపుచ్చు బ్రహ్మరాతకు ప్రసిద్ధుడాయె. ఇక్కడ కూడా బ్రహ్మవిద్య ప్రదర్శించకుండా ఉంటాడా. ప్రభుత్వరంగం పరువు తీయకుండా ఉంటాడా..! ◆

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
[illegible] . . . 15
క్రీడారంగం . . . 17
మినీ కథ . . . 22
పలుకుబడి 24
వగైరా . . . .

ఇంకా...

విద్య స్ఫూర్తి నివ్వాలి
బాలవికాసం . . 10



అందాల సీమ 'భైరవకోన'
టూరిస్ట్ గైడ్ . . . 16

కొడుకులు
కథ . . . 18, 19

సొంత ఇంట్లోనే ఖైదీగా...
రియల్‌స్టోరీ . . .23


చట్టసభల్లో 10% మాత్రమే మంత్రులుండాలి
మళ్ళీ క్యాబినెట్ విస్తరణ
కేంద్రంలో జంబో క్యాబినెట్
Dhali..


అప్పులు చేయడంలో మీకు మీరే సాటి.. ఒప్పుకొంటున్నా.... నన్నొదిలేయండి మహాప్రభో!!
నాకెవరు సరిలేరు బాబు సవాల్
Dhali..


ఆలస్యంగానైనా.. స్పందించావా.. లేదా.. అన్నదే పాయింటు!!
ఆత్మహత్యలు
కరువు, వలసలు
కరువుపనుల్లో రైతులకు చెల్లింపు బియ్యం
Dhali



నిత్య నూతనం ఎవరెస్ట్ ఆరోహణం

* పులుగు శ్రీనివాస్

ఎడ్మండ్ హిలరీ, టెన్సింగ్ నార్కే ఎవరెస్ట్ శిఖరారోహణ చేసి 50 ఏళ్ళు గడిచినా ఇంకా ఇప్పటి ఔత్సాహిక అధిరోహకులకు ఆ ఎవరెస్ట్ శిఖరాలు ఓ సుందర స్వప్నంగానే ఉన్నాయి. సాధారణంగా ఒక వ్యక్తి పర్వతాల దిగువ నుండి ఎవరెస్ట్ శిఖరానికి చేరడానికి అత్యంత తక్కువ సమయం అంటే 16 గంటలు తీసుకుంటాడు. ఎవరెస్ట్‌ను అధిరోహించిన వారిలో అందరికన్నా పెద్ద వయస్సు గల వ్యక్తి 65 ఏళ్ళ వృద్ధుడు కాగా, అందరికన్నా పిన్న వయస్కుడు 16 ఏళ్ళ యువకుడు. అన్నిటికంటే అద్భుతం ఏమిటంటే ఓ అంధుడు ఎవరెస్ట్ శిఖరాన్ని ఎంతో పట్టుదలగా అధిరోహించడం.

సాధారణంగా పర్వతారోహకులు స్కీయింగ్, స్నోబోర్డులతో మంచుమీద జారడం ద్వారా, పారాగ్లైడింగ్ ద్వారా ఎవరెస్ట్ శిఖరంపై విజయవిహారం చేస్తారు. ఇంకా పర్వతం మీదకు ఎక్కడం, దిగడంలో నవ్య రీతులకు కొదువలేదు.

ఎవరెస్ట్‌ను అధిరోహించదలచిన వారు భారీగా రుసుము చెల్లించడానికి కూడా వెనకాడడం లేదు. దీనికోసం ఒక్కో పర్వతారోహకుడు దాదాపు రు.30 లక్షలు చెల్లిస్తున్నాడు. అయినా రద్దీ తగ్గడం లేదు. పర్వతారోహణలో చిన్న పొరపాటు కూడా ప్రాణాంతకమవుతుందని తెలిసి కూడా పర్వతారోహకులు ఎక్కడానికి సాహసిస్తున్నారు. అంటే.. ఎవరెస్ట్ మీద వున్న మక్కువ అటువంటిది. ఆ శిఖరాన్ని ఎక్కే ఆలోచన ముందు ప్రాణాలు, భారీ రుసుం దిగదుడుపే అవుతున్నాయి.

సంబరాలు-విషాదాలు

ఇప్పటికి 63 దేశాలకు చెందిన 1200 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. ఎవరెస్ట్ మీద ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 176 మంది. ఒకే ఒక్క రోజున అంటే 1991 మే 23వ తేదీన 89 మంది పర్వతారోహకులు ఎవరెస్ట్ శిఖరాన్ని అధికారోహించడం ఓ విశేషమైన సంబరం. అయితే 1996 మే 10, 11వ తేదీలలో పది మంది పర్వతారోహకుల ప్రాణాలు మంచులో కలిసిపోవడం ఓ విషాదం.

ఒక పర్వతారోహకుడు ఎవరెస్ట్ శిఖరాన్ని 11 సార్లు అధిరోహించి రికార్డు సృష్టించగా, మరో ఇద్దరు 10 సార్లు అధిరోహించారు. తాజాగా సవరించిన అంచనా ప్రకారం ఎవరెస్ట్ శిఖరం ఎత్తు 29,035 అడుగులు. ఇంత పెద్ద పర్వతం వెనుక మరో మహత్తర అంశం ఏమిటంటే ఈ పర్వతం అంతా అనేక హిమనదుల కూటమి మీద పెరిగిన భారీ పిరమిడ్ మాత్రమే. ఎవరెస్ట్ శిఖరాగ్రంపై ధవళ కిరీటం లాగా తేలియాడే మంచు తురాయిలు ఆ హిమపిరమిడ్ ఔన్నత్యాన్ని, గాంభీర్యాన్ని దిశదిశలా చాటుతాయి.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడానికి 15 ప్రధాన మార్గాలు వున్నాయి. హిమాలయాల్లో వున్న మరే ఇతర శిఖరం కన్నా ఎవరెస్ట్ శిఖరమే పర్వతారోహకులను అమితంగా ఆకర్షిస్తోంది. కారణం ఆ శిఖరాన్ని అధిరోహించిన వారి మీద మీడియా ప్రసంశల జల్లు కురియడం, ప్రజలదృష్టి మళ్ళడం కావచ్చు.

పర్యావరణ కాలుష్యం :

పర్వత ప్రాంతాల టూరిజం పుణ్యమా అని ఎవరెస్ట్ పర్యావరణం దెబ్బతింటున్నది. బహుళజాతి సంస్థలైన 'కోకాకోలా' 'పెప్సీ' లాంటి కంపెనీలు తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ఈ పర్వత ప్రాంతాన్ని వాడుకుంటే చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తొలగించాల్సి వచ్చింది. మంచు పర్వతాల స్వచ్ఛత మీద అర్ధశతాబ్దం నుంచి ముమ్మరమైన చొరబాట్లు.. ఈ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా మానవాళిని అప్రమత్తం చేయాలి. ఎవరెస్ట్ పర్వతాలు తమను తాము పునరుద్ధరించుకోవడానికి మానవ ప్రమేయం, మానవ సహకారం ఇప్పుడు ఎంతైనా అవసరం.

మొట్టమొదటి కాలు :

ప్రపంచంలోని అత్యున్నత శిఖరమైన ఎవరెస్ట్‌పై 1953 మే 29న ఇద్దరు వ్యక్తులు మొట్టమొదట కాలు మోపారు. అంతవరకు స్తబ్ధంగా వున్న హిమాలయాల ఆరోహణ క్రీడ తీరుతెన్నులు ఆ క్షణంతో మారిపోయాయి. 50 ఏళ్ళ తరువాత ఎడ్మండ్ హిలరీ, టెన్సింగ్ నార్కేల అనుభవాలను చదువుతుంటే యాంత్రికమైనదిగా పైకి కనిపించే పర్వతారోహణలో

దాగి వున్న నిత్యనూతనత్వం ఎంతో గ్రహిస్తాం.

సాహసికుల అన్వేషణకు ఎవరెస్ట్ శిఖరారోహణ ఒక పెద్ద మలుపు. అది ఉత్తర, దక్షిణ ధ్రువాలను చేరుకోవడమనే ఘన కార్యం. ఆ చారిత్రాత్మక ఘట్టం స్వర్ణోత్సవ సంబరాలలో సహజంగానే అందరూ పాలుపంచుకుంటున్నారు.

స్వర్ణోత్సవ సంబరాలు:

సమాచారం, కమ్యూనికేషన్లు, వినోదం కలగలసిన నేటి 'మంచు' యుగంలో ధగధగలాడే ఎవరెస్ట్ శిఖరారోహణ స్వర్ణోత్సవ సంబరం ఇంటింటికీ, మనిషి మనిషికీ చేరడం విచిత్రమేమీ కాదు.

1986లో టెన్సింగ్ కన్ను మూశారు. సర్ ఎడ్మండ్ - శిఖరారోహణ స్వర్ణోత్సవ సందర్భంగా భారతదేశం, నేపాల్, మరికొన్నిదేశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొబోతున్నారు. ఢిల్లీలోని రెండు రోడ్లకు వీరిద్దరి పేర్లు పెట్టబోతున్నారు.

టెన్సింగ్ భారతీయుడేనా ?

ప్రపంచంలో సర్వశ్రేష్ఠ షెర్పా తన మంచు గొడ్డలికి నాలుగు జెండాలు కట్టుకొని, ఎవరెస్ట్‌ను అధిరోహించాడు. అవి బ్రిటన్, భారత్, నేపాల్, ఐక్యరాజ్యసమితి పతాకాలు. టిబెట్‌లో పుట్టి, నేపాల్‌లో పెరిగి, 13 ఏళ్ళ వయసులో భారత్‌లోని డార్జిలింగ్‌కు వచ్చాడు. అందుకే అతడి జాతీయత మీద సందిగ్ధత నెలకొంది. ఎవరెస్ట్‌ను ఎక్కినప్పుడు తాను నేపాలీనని చెప్పుకున్నాడని, ఆ తర్వాత కొన్ని రోజులకు భారత పౌరుడినని అన్నాడనీ కొందరి వాదం. అయితే టెన్సింగ్ అపూర్వ విజయం వెలుగులో అతడి జాతీయతను ఎవరూ పట్టించుకోనక్కర్లేదని చాలా మంది అంటారు.



ఈ ఏడాది వందలాది మంది పర్వతారోహకులు ఆనాటి మధుర క్షణాలను అనుభవించడానికి హిమాలయాలను అధిరోహిస్తున్నారు. భారత్, నేపాల్ సైన్యాలకు చెందిన పర్వతారోహక బృందాలు కూడా హిమాలయాల మీదకు చేరాయి. వీరందరినీ నేషనల్ జియోగ్రాఫిక్ టీవీ కెమెరాలు వెంబడిస్తున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల రాజధానుల్లో సమావేశాలు, సదస్సులు ఏర్పాటవుతున్నాయి. గత ఏడాది హిలరీ కుమారుడు పీటర్, అమెరికన్ పర్వతారోహకుడు బ్యారీ బిషప్ కుమారునితో కలిసి ఎవరెస్ట్ శిఖరారోహణ చేశాడు. అలాగే టెన్సింగ్ కుమారుడు జమ్లింగ్ ఎవరెస్ట్ అధిరోహణపై నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్ ప్రసారం చేసిన స్మారక డాక్యుమెంటరీకి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ప్రప్రథమ ఎవరెస్ట్ శిఖరారోహణను జ్ఞాపకం చేసుకోవడమనేది ఈ రోజు టీవీ ప్రసారాలలో ముఖ్య భాగం ఆక్రమించడం పర్వతారోహణ పట్ల పెరిగిన ఆదరణకు అద్దం పడుతుంది.

ఆధునిక టెక్నాలజీ :

ఈనాటి పర్వతారోహకుడు అత్యధునాతన టెక్నాలజీని ఆసరా తీసుకొంటున్నాడు. వెచ్చని గోర్‌టెక్స్ దుస్తులు, ఉపగ్రహ ఫోన్ ఒక చేత, తేలికైన మంచు గొడ్డలి మరో చేత ధరించి, ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలు తెలుసుకునే ఆధునిక పర్వతారోహకుడు తన యాత్రను

ఉమ్మడి విజయం

నేను టెన్సింగ్ నార్కేని 1953లో ఖాట్మండులోని బ్రిటీష్ రాయబార కార్యాలయంలో కలుసుకున్నాను. అయితే అప్పటికే పర్వతారోహణలో టెన్సింగ్ నార్కే ప్రతిభ, కృషి గురించి నేను పత్రికల్లో చదివి ఉన్నాను. ఖాట్మండులో మేమిద్దరం బాగా సన్నిహితమయ్యాం. ఖుంబు హిమనదం, ఎవరెస్ట్ అధిరోహణను కలిసికట్టుగా సాగించాం. మేమిద్దరం గట్టి జట్టు అని చెప్పవచ్చు. టెన్సింగ్ చాలా బలిష్ఠుడు, హిమాలయ వాతావరణానికి బాగా అలవాటు పడిన వాడు. నేనూ అంతే. అయినా మేము ఎవరెస్ట్ అధిరోహణలో సఫలమవుతామని గట్టిగా నమ్మకం పెట్టుకోలేకపోయాం. అదో మానసిక అవరోధమని చెప్పాలి. అంతకుముందు ఎవరూ ఎవరెస్ట్‌ను అధిరోహించడంలో కృతకృత్యులు కాలేకపోయారు. అందుకే శిఖరాగ్రాన్ని చేరుకోవడంలో సఫలమవుతామా, విఫలమవుతామా అన్నది ఆలోచించలేకపోయాం. అయినా మేము పట్టు విడవకుండా ప్రయత్నించాం. ఎవరెస్ట్‌ను అధిరోహించాలని దృఢ నిశ్చయం చేసుకున్నాం.



హిలరీ

యావత్ ప్రపంచంలో 27,000 అడుగుల ఎత్తులో ఒక రాత్రి గడిపిన మొట్టమొదటి బృందం మాదే. మంచులో కాలు జారిపోయే చోట చిన్నగుడారం వేసుకుని, అందులో నుంచి జారిపోకుండా అనుక్షణం జాగ్రత్తపడుతూ, ఎంతో అసౌఖ్యంగా ఆ రాత్రి గడిపాం. అక్కడ ఉష్ణోగ్రత చాలా చాలా తక్కువ. ఎలాగైతేనేం చివరకు తెల్లవారింది. గుడారం నుంచి బయటకు తొంగిచూశాం. వాతావరణం మెరుగుపడినట్లు గమనించాం. ఏర్పాట్లన్నీ చేసుకుని దక్షిణ శిఖరం వైపు మంచువాలును ఎక్కసాగాం. దక్షిణ శిఖరం వైపు దృష్టి సారించగానే దాన్ని ఆరోహించడం సాధ్యమేననిపించింది. మంచులో మెట్లు చెక్కుకుంటూ, ఇప్పుడు మనం హిలరీ మెట్టుగా పిలుచుకుంటున్న ప్రదేశానికి చేరుకున్నాం. హిలరీ మెట్టు 44 అడుగుల ఎత్తయిన మెట్టు. అక్కడి నుంచి పైకి ఎక్కుతూ మంచు గుమ్మటాన్ని అందుకున్నాం. నేనూ, టెన్సింగ్ ఆ గుమ్మటం అగ్రం మీదకు చేరి ప్రపంచం పై కప్పుమీద నిలిచిన తొలి వ్యక్తులుగా పేరు తెచ్చుకున్నాం.

ఈ విజయానికి టెన్సింగ్ నా కన్నా ఎక్కువగా ఉత్తేజితుడయ్యాడనుకొంటున్నాను. నాలో ప్రగాఢమైన సంతృప్తి వెల్లివిరిసింది.

మాకు ముందు చాలా బృందాలు ఎవరెస్ట్ ఎక్కడానికి ప్రయత్నించాయి. అవి చాలా దూరం పురోగమించాయి కూడా. కానీ, వారెవరూ మాలా కృతకృత్యాలు కాలేదు. ఎవరెస్ట్ అధిరోహణతో నాలో గొప్ప అనుభూతి వెల్లివిరిసింది. నేను టెన్సింగ్‌తో కరచాలనం చేయడానికి చేతులు చాచాను. కానీ, ఆయన కరచాలనంతో తృప్తి చెందలేదు. నా భుజాల చుట్టూ చేతులు వేసి గట్టిగా ఆలింగనం చేసుకుని మా విజయాన్ని ఆస్వాదించాడు. తర్వాత టెన్సింగ్‌ను సమున్నత స్థలంలో నిలబెట్టాను. ఆయన మంచు గొడ్డలికి నాలుగు పతాకాలను తగిలించి ఫొటో తీశాను. తర్వాత దిగువన ఉన్న పర్వత శ్రేణులను ఫొటో తీశాను. మేము నిజంగా ఎవరెస్ట్‌ను అధిరోహించామని నిరూపించడానికి ఈ ఫొటోలు అవసరం. ఎవరెస్ట్‌పై నేను ఫొటో దిగలేదు. అయినా నేను అక్కడకు చేరుకున్నాననడంలో అనుమానం అక్కర్లేదు.

ఇక ఎవరెస్ట్ మీద మొట్టమొదట కాలు మోపినది ఎవరనే వివాదానికి వస్తే మేము ఒక జట్టుగా ఈ విజయం సాధించామని చెప్పదలిచాను. శిఖరంపైకి పయనంలో నేను ముందు నిలిచాను. శిఖరం మీదకు ఎక్కినప్పుడు టెన్సింగ్ నా వెనకనే ఉన్నాడు. కాబట్టి మేము ఉమ్మడిగా శిఖరాగ్రాన్ని చేరామని స్పష్టం చేస్తున్నాను.

సాధ్యమైనంత నిరపాయం చేసుకొంటున్నాడు. నాటికీ నేటికీ అతడు మోసే బరువు కూడా తగ్గిపోయింది. 1953లో ఎవరెస్టను అధిరోహించినప్పుడు తాను 60 పౌనుల బరువును నిత్యం మోసేవాడినని హిలరీ చెప్పారు. ఈనాటి పర్వతారోహకులు అందులో సగం బరువు మోస్తే గొప్ప. "సాంకేతిక పరిజ్ఞానం పర్వతారోహణను విప్లవీకరించడంతో. మరణాల రేటు నాటకీయంగా తగ్గిపోయింది'' అని ఎవరెస్ట్ పర్వతారోహకుడు ఆంగ్ పుర్బా చెప్పారు.

అయితే పర్వత శక్తి నుంచి టెక్నాలజీ కూడా ఎల్లవేళలా రక్షించలేదు. 1996 మే 98వ తేదీన అయిదు పర్వతారోహక బృందాలు ఎవరెస్ట్‌పై దాడి ప్రారంభించాయి. వాతావరణం మొదట్లో అనువుగా వున్నా తర్వాత హఠాత్తుగా మంచు తుపాను విరుచుకుపడింది. పర్వతారోహకులు తప్పటడుగులు వేయడం కూడా జరిగింది. అప్పట్లో మొత్తం 8 మంది పర్వతారోహకులు మరణించారు. ఇదే ఎవరెస్ట్‌పై అత్యంత తీవ్ర ప్రమాదం. అప్పట్లో రాబ్‌హాల్ అనే న్యూజిలాండ్ పర్వతారోహకుడు 28,000 అడుగుల ఎత్తులో దక్షిణ శిఖరంపై తుపానులో చిక్కుకుపోయాడు. తాను బతికి బయటపడడం కల్ల అని అతడికి అర్థమైపోయింది. చేతిలో వున్న ఉపగ్రహ ఫోన్ ఎక్కడో న్యూజిలాండ్‌లో క్రైస్ట్‌చర్చ్ పట్టణంలో తన భార్యతో మాట్లాడే అవకాశమిచ్చింది. "నీవంటే నాకెంతో ప్రేమ, హాయిగా నిద్రపో స్వీట్‌హార్ట్, మరీ ఎక్కువగా కలవరపడకు" అనేవి ఆ ఫోన్‌లో అతని చివరి పలుకులు. టెక్నాలజీ అంతకుమించి ఆదుకోలేకపోయింది.

ఇప్పటి నుంచి అయిదు, పది లేదా ఇరవై ఏళ్ళలో ఎవరెస్ట్‌కు ఏం జరగబోతోంది అని ప్రశ్నించుకుంటే, పెద్ద సంఖ్యలో జనం అక్కడికి తరలి వస్తారని చెప్పవచ్చు. గత అయిదేళ్ళలోనే ఎవరెస్ట్ యాత్రికుల సంఖ్య ఆశ్చర్యకరంగా పెరిగిపోయింది. సరైన ఫీజు చెల్లిస్తే వీళ్ళతో శిఖరారోహణం చేయించే వాణిజ్య సంస్థలూ పుట్టుకొచ్చాయి. అవి తమ ఫీజులు కూడా పెంచేశాయి. ఈ ఏడాది జరిగిన 45 ఎవరెస్ట్ యాత్రలలో కనీసం 10 యాత్రలు ఈ సంస్థలకు బాగానే లాభాలు ఆర్జించిపెట్టాయి.

ఈ సంస్థలు సమంజస శారీరక యోగ్యత కలిగిన అభ్యర్థుల నుంచి తలా 65 వేల డాలర్ల చొప్పున వసూలు చేసి, ఎవరెస్ట్ అధిరోహణకు తీసుకెళ్ళడానికి సిద్ధపడుతున్నాయి. ఎవరెస్ట్ క్రిక్కిరిసిపోతోందని గొడవ చేసే స్వచ్ఛతావాదులకు ఇది ఆగ్రహం కలిగిస్తోంది. గైడ్ తోడు లేకుండా మామూలు కొండలు ఎక్కలేని వారు కూడా ఎవరెస్ట్‌పైకి లంఘించి, దాన్ని దిగజారుస్తున్నారని వీరి ఫిర్యాదు. కానీ ఎవరెస్ట్ పర్వతారోహకుల నుంచి నేపాల్ ప్రభుత్వానికి తలా 10 వేల డాలర్ల చొప్పున ముడుతోంది. చైనాకు 5వేల డాలర్ల చొప్పున గిట్టుబాటు అవుతోంది. కనుక ఏటా ఎవరెస్ట్ పైకి అనుమతిస్తున్న పర్వతారోహకుల సంఖ్య తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. "ప్రతి ఒక్కరికీ తమ కలను నిజం చేసుకునే అవకాశాన్ని ఇస్తున్నాం. అసలు సిసలు పర్వతారోహకులకూ, పర్వతారోహణలో ఓనమాలు కూడా తెలియని వారికీ మధ్య తేడాను పసిగట్టే ప్రావీణ్యం మాకులేదు" అని ఒక నేపాలీ ప్రభుత్వాధికారి వివరణ ఇచ్చారు. ◆

ఎవరెస్ట్ అధిరోహకులకు ఆక్సిజన్ షెర్పాలే!

ఎవరెస్ట్ అనగానే వెంటనే ఒక టెన్సింగ్ నార్కే మరో ఎడ్మండ్ హిల్లరీలు మనకు ధీరోధాత్తులుగా స్ఫురిస్తారు. అర్ధ శతాబ్ద ఎవరెస్ట్ అధిరోహణా చరిత్రలో ఎందరెందరో 'కథానాయకులు' కానవస్తారు. అయిదున్నరవేల మీటర్ల మంచు శిఖరాగ్రంపై ఎన్ని జాతీయ పతాకాలు ఎగిరాయో ఇప్పటికి! తొలిసారిగా ఎవరెస్ట్‌ను అధిరోహించిన నాటి నుంచీ నేటి దాకా తెర వెనక కన్పించని నిజమైన హీరోలు 'నేపాలీ షెర్పాలు'. పర్వత ప్రాంత దున్నలంటే నమ్మడం కష్టంగా తోస్తుంది. వాస్తవం మాత్రం అదే!

చరిత్రను అవలోకిస్తే కల్నల్ జాన్ హంట్ నేతృత్వంలోని బ్రిటిష్ పర్వతారోహక బృందం తొలిసారిగా ఎవరెస్ట్‌ను అధిరోహించేందుకు యత్నించింది. వారిని మంచుకొండల శిబిరాల దాకా తరలించి దుర్గమ మంచు పర్వత సానువుల్లో, మలుపుల్లో బహు జాగ్రత్తగా మార్గ నిర్దేశనం చేసిన వారు నేపాలీ షెర్పాలు. ఈనాటికీ ఔత్సాహిక పర్వతారోహకులు వారు లేకుండా ఒక్క అడుగు ముందుకు వేయలేరు. ఆక్సిజన్ సిలిండర్ల నుంచి అవసరమైన సున్నిత పరికరాల దాకా వేలాది మీటర్ల ఎత్తుకు మోసుకుపోయే నిజమైన కథానాయకులు వీరే. ఒక్కో బృందంలోని ఒక్కొక్క అధిరోహకునికి కనీసం 20మందికి తక్కువ కాకుండ షెర్పాలు సేవలందిస్తారు. ఒక్కో షెర్పా కనీసం 35కిలోలకు తక్కువ కాకుండా బరువును వీపున మోస్తారు. మంచు సానువుల్లో ఇంకా అధిక బరువును మోసేందుకు పర్వత ప్రాంత దున్నలను నియోగిస్తారు. వాటి పరిస్థితి మరీ ఘోరం. మూడువేల అడుగుల పైకి వెళ్లిన అనంతరం అక్కడ కొన్ని రోజులు గడిపాక అవి ఆ పరిస్థితులకు అలవాటు పడతాయి. తిరిగి కిందికి తీసుకువస్తే వాటికి ఊపిరి ఆడదు. మరణం అనివార్యం. అందుకే వాటిని తిరుగు ప్రయాణంలో నిర్దయగా వదిలివేసి వస్తారు.

అనునిత్యం దారిద్ర్యంలో మగ్గిపోయే నేపాలీ ప్రజానీకం నాలుగు డాలర్ల కూలీ కోసం తమ ప్రాణాలను పణంగా పెడుతున్న విషాద వాస్తవం పెట్టుబడీదారీ మీడియాను ఆకర్షించలేక పోతోంది. రాజధాని ఖాట్మండు నుంచి లూక్లా (బేస్‌క్యాంప్) దాకా ఎలాంటి రహదారీ లేదు. ఆ మార్గంలో పయనించేందుకే సుమారు నెలరోజుల సమయం పడుతుంది. ఇటీవల నేపాల్ ప్రభుత్వ ఆధీనంలోని వైమానిక సంస్థ లూక్లా వరకు నేరుగా విమాన సౌకర్యం కల్పించింది. మరోవైపు చైనా, స్విట్జర్లాండ్ సహకారంతో మరో బేస్‌క్యాంప్ జిరి దాకా రహదారిని నిర్మించారు. అధిరోహకులు ఈ మార్గాన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అక్కడి నుంచి ఎవరెస్ట్ అంచుల్లోకి పక్షం రోజుల ప్రయాణం. ఇక అధిరోహణ ఆరంభం అవుతుంది. ఒక్కో షెర్పా తన వీపున బరువుతో పాటు మరో రెండు దున్నలపై బరువులను మోపి వాటిని అదిలిస్తుండాలి. ఇంతటి దుర్గమ ప్రయాణంలో నిజమైన కథానాయకులు మరుగున పడిపోతున్నారు. ఎవరెస్ట్ అంతటి వారి ధీరోధాత్తతను ప్రపంచం గుర్తించేదెప్పుడో!

తొలి మహిళా పర్వతారోహకురాలు

బిచేంద్రీ పాల్

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళ బిచేంద్రీపాల్. ఆమె తన తల్లిదండ్రులకు మూడవ సంతానం. "పాల్ కుటుంబంలో నేను ఏ విధంగానూ వెనుకబడి ఉండరాదనే దృఢ సంకల్పంతో ఉన్నాను. మగ పిల్లలు చేసినవే చేయడం గాదు, అంతకంటే మిన్నగా చేయాలని చిన్ననాడే నిర్ణయించుకొన్నానని" ఆమె తన స్మృతుల్లో రాసుకొన్నారు. "నేను ప్రకృతిలో భాగంగా మారడం వల్ల స్వతంత్రంగా, నిర్భీతిగా ఉండగలిగాను" అని కూడా ఆమె రాశారు. పాఠశాలలో చదివే రోజుల్లోనే ఆమె పర్వత ప్రాంతానికి వెళ్ళడం సంభవించింది. ఆమె తిండి, నీరు లేకుండా తోటి విద్యార్థులతో ఆ రాత్రంతా అక్కడ గడపాల్సి వచ్చింది. ఆ అనుభవమే ఆమెకు పర్వతాలపట్ల అభిమానాన్ని పెంచింది.

1980ల ప్రారంభంలో ఆమె నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్‌కు దరఖాస్తు చేశారు. 1984లో ఆరుగురు మహిళలు, 11 మంది పురుషులతో కూడిన పర్వతారోహణ బృందంలో ఆమె సభ్యురాలయ్యారు. 1984 మార్చిలో ఆ బృందం ఖాట్మండ్‌కు వెళ్ళింది. బచేంద్రి హిమాలయాలను చూడటం అదే ప్రథమం. "పర్వత బిడ్డలమైన మేము ఎల్లప్పుడూ వాటిని ఆరాధిస్తామని" ఆమె తన స్మృతుల్లో తెలిపారు. వారు మే నెలలో పర్వతారోహణను ప్రారంభించారు. ఆ నెల మధ్యలో 24 వేల అడుగుల ఎత్తున వున్న క్యాంపు-3లో వారు నిద్రిస్తున్నారు. అప్పుడు పెద్ద మంచు తుపాను రావడంతో అనేకమంది గాయపడ్డారు. బిచేంద్రి తలకు కూడా పెద్ద దెబ్బ తగిలింది. దానితో బృందమంతా బేస్ క్యాంప్‌కు వచ్చింది. ఆ దెబ్బలతో అనేకమంది అక్కడే ఆగిపోయారు. బిచేంద్రీ పాల్ మాత్రం తిరిగి యాత్రను కొనసాగించేందుకు ఎన్నికయ్యారు. ఆ బృందం మే 23 మధ్యాహ్నం 1.07 నిముషాలకు శిఖరాగ్రాన్ని చేరుకొంది. "పర్వతాగ్రాన్ని చేరుకొన్నప్పుడు మేము క్షేమంగా తిరిగి వెళ్ళాలనేదే నా ఆకాంక్షగా ఉంది. అప్పుడు ఆ విజయాన్ని నేను ఆస్వాదించలేకపోయాను. అక్కడ మేము 45 నిముషాలు గడిపాము. ఫొటోలను తీసుకొన్నాము. కానీ 'మేము క్షేమంగా తిరిగి వస్తామా' అనే భయంతోనే ఉన్నాను" అని ఆమె రాశారు. అనంతరం 15 సంవత్సరాల కాలంలో అనేకసార్లు ఎవరెస్టుతో సహా అనేక పర్వతాలను ఆమె అధిరోహించారు.

అడ్డచుట్ట తాగుతున్న మహిళ

కేవలం అవగాహనా లోపం కారణంగానే లక్షల కొద్దీ కేన్సర్ మరణాలు సంభవిస్తున్నాయి. క్యాన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే ప్రతి సంవత్సరం కనీసం 8 లక్షల మరణాలను ఆపవచ్చు. ఒకప్పుడు సరైన చికిత్స అందుబాటులో లేక క్యాన్సర్ మరణాలు సంభవించేవనీ, ప్రస్తుతం కీమోథెరపీ, రేడియేషన్, ఇటాలియన్ ట్రీట్‌మెంటుల్లాంటి ఎన్నో ఆధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో లేక క్యాన్సర్ మరణాలు సంభవించేవి. ప్రస్తుతం కీమోథెరపీ, రేడియేషన్, ఇటాలియన్ ట్రీట్‌మెంటుల్లాంటి ఎన్నో ఆధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నా వ్యాధి సోకిన ప్రారంభదశలోనే గుర్తించకపోవడం వల్లనే ఇంకా క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయి. క్యాన్సర్ వ్యాధి గురించిన పూర్తి వివరాలను, వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించగల కొన్ని సూచనలను తెలుసుకొందాం.

అవగాహనా లోపంతోనే క్యాన్సర్ మరణాలు

*** డా॥ కరీం మొహిద్దీన్**

ఆరోగ్య అలవాట్లను బట్టి, చేసే వృత్తిని బట్టి, వాతావరణంలోని మార్పుల కారణంగానూ ఈ క్యాన్సర్ వ్యాధి వస్తుంది. ముందు జాగ్రత్తలు పాటిస్తే 50 నుండి 70 శాతం మేర క్యాన్సర్ నిరోధం సాధ్యమే. ఒక్క పొగతాగడం మానేస్తేనే 35 శాతం క్యాన్సర్ మరణాలను నిరోధించవచ్చు.

మూడింట ఒక వంతు క్యాన్సర్ మరణాలు కేవలం పొగతాగడం వల్లనే సంభవిస్తున్నాయి. పొగాకు వాడకం వల్ల నోటి క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, గొంతు క్యాన్సర్ లాంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ప్రస్తుతం 15 రకాలకు పైగా పొగాకు ఉత్పత్తులు ప్రజాజీవితంలో ఉండి క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయి.

ఊపిరితిత్తుల కేన్సర్ రావడానికి 35 శాతం పొగతాగడమే కారణమని నిర్ధారణ అయింది. పొగతాగే వారివల్ల వారికే కాక వారి చుట్టూ ఉండేవారికి, కుటుంబ సభ్యులకూ, ముఖ్యంగా వారి భార్యలకు కూడా ఊపిరితిత్తుల

క్యాన్సర్ వ్యాధిని తొలిదశలోనే గుర్తించడానికి ఈకింది సూచనలు ఉపకరిస్తాయి.

* శరీరంలోని ఏ భాగంలోనైనా మానని గాయమున్నప్పుడు క్యాన్సరేమోనని అనుమానించాలి. ఆవ్యక్తికి షుగర్ వ్యాధి లేకుంటే మరింత జాగ్రత్త వహించాలి.
* ఏ శరీర భాగం నుండైనా అసాధారణ రక్తస్రావం ఉన్నా, రోజుల తరబడి ఆగకుండా రక్తస్రావమవుతున్నా ఈ వ్యాధి ఉందేమోనని అనుమానించాలి.
* శరీరంలోని ఏ భాగంలోనైనా గడ్డలుండి, ఎంతకాలానికీ తగ్గకుండా ఉన్నా సిగరెట్లు లాంటి పొగాకు ఉత్పత్తులు వాడే వారిలో ఆహారం మింగడంలో ఇబ్బంది అన్పించినా, ఈ సమస్యలు దీర్ఘకాలం (నెలల తరబడి) ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
* మలమూత్ర విసర్జనలో రోజుల తరబడి రక్తం కనిపిస్తున్నా, లేక ఇతర కొత్త పనులు కనిపించినా, ఈ వ్యాధి ఉందేమోనని అనుమానించాలి.
* పులిపిరికాయలు గానీ, పుట్టుమచ్చలు గానీ బాగా పెరుగుతున్నట్టు అనిపించినా, నెలల తరబడి దగ్గు, గొంతువాపు ఉన్నా క్యాన్సర్ వ్యాధి అని అనుమానించి నిర్ధారణ చేయించుకోవాలి. నిర్లక్ష్యంతో ఆలస్యం చేస్తే అకాల మరణం సంభవించవచ్చు. కేవలం చెడు ఆరోగ్య అలవాట్లు ఉన్నవారిలోనే కాకుండా, తప్పనిసరై ఎండలో తిరిగే ఉద్యోగం చేసేవారిలోనూ, ఎక్స్‌రే యూనిట్లలో పని చేసే వారిలోనూ, కొన్ని రకాల పొల్యూషన్ ఉండే కర్మాగారాల్లో పని చేసే వారిలోనూ కూడా క్యాన్సర్ సోకే అవకాశాలున్నాయి. అలాగే వాతావరణంలో మార్పుల కారణంగా ఏ అలవాట్లూ లేని వారికి కూడా క్యాన్సర్ వ్యాధి సోకే అవకాశం ఉంది. అయితే ఇలాంటి కేసుల శాతం బాగా తక్కువగా ఉంటుంది.

క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి.

అలాగే మద్యపానం వల్ల కూడా నోటి క్యాన్సర్, లారింక్స్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, గొంతు క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, లివర్ క్యాన్సర్‌లాంటివి వస్తాయి. మద్యపానం మానివేయడం ఈ వ్యాధి నివారణకి చికిత్స. మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ మన దేశంలో ఎక్కువగా కన్పిస్తుంది. బాగా చిన్నతనంలోనే వివాహం జరిగి, ఎక్కువసార్లు గర్భధారణ జరిగిన మహిళల్లో ఈ వ్యాధి ఎక్కువ. స్త్రీలకు యుక్తవయసు తరువాతే వివాహం చేయడం, పరిమిత సంతానం కలిగి ఉండటం, జననేంద్రియాలను పరిశుభ్రంగా ఉంచడం లాంటి జాగ్రత్తల ద్వారా ఇలాంటి క్యాన్సర్ బారిన పడకుండా మహిళలు జాగ్రత్త పడవచ్చు. పాలిచ్చే తల్లులు పిల్లలకు ఎక్కువ కాలం పాలివ్వడం ద్వారా స్తనాల క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ రాకుండా నిరోధించవచ్చని మహిళలు తెలుసుకోవాలి. ఆహారంలో కొవ్వు పదార్థాలు తగ్గించుకొని బొప్పాయి లాంటి పండ్లు, పీచు పదార్థాలుండే ఆకుకూరలు, కాయగూరలు తినడం ద్వారా పెద్ద ప్రేవులకు వచ్చే క్యాన్సర్‌ను నిరోధించవచ్చు.

ఒక దశాబ్దం క్రితం క్యాన్సర్ వ్యాధి వస్తే మరణం తప్పదనేంత భయంకర పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం కీమోథెరపీ, రేడియేషన్, ఇటాలియన్ థెరపి లాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అసలు క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజలందరిలో సమగ్ర అవగాహన ఉంటే ఆ వ్యాధి రాకుండా నిరోధించడం సాధ్యమే. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స పద్ధతులతో క్యాన్సర్‌ను చికిత్స చేయవచ్చు. అయితే వ్యాధి సోకిన తరువాత ఎంత త్వరగా గుర్తించగలిగితే చికిత్సా ఫలితాలు అంత ఫలవంతంగా ఉంటాయి. సామాన్యంగా క్యాన్సర్ గురించి అవగాహన లేని వారు, క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించే అవకాశం లేదు. సామాన్యంగా క్యాన్సర్ రోగులు వ్యాధి బాగా ముదిరిన తరువాతనే వైద్య సలహాకోసం వెళతారు. కానీ వ్యాధి ముదరకముందే నిర్ధారణ చేయించు కొంటే చాలా మంచిది. ఆలస్యమైతే పరిస్థితి విషమిస్తుంది. అలాంటి సమయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సా పద్ధతులతో రోగం పూర్తిగా నయం చేయలేకపోయినా కనీసం జీవిత కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది. ◆

పసికందులలో జాండిస్



శిశువులలో ముఖ్యంగా, బరువు తక్కువగా పుట్టినా, నెలలు నిండకముందే పుట్టినా రక్తంలో బైలిరూబిన్ ఎక్కువగా ఉంటుంది. బైలిరూబిన్‌ను మెటబొలైజ్ చేసే లివర్ ఎంజైములు శిశువులలో బాగా అభివృద్ధి చెందకపోవడం, శిశువుల రక్తంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఎర్రరక్తకణాలు విచ్ఛిత్తి చెందడం మొదలైన వాటి కారణంగా జాండిస్‌కు గురికావడం జరుగుతుంది. శిశువులలో సాధారణంగా కనిపించే ఈ జాండిస్‌నే 'ఫిజియోలాజికల్ జాండిస్' అంటారు. ముఖ్యంగా ఈ రకమైన జాండిస్ శిశువు పుట్టిన రెండవ రోజు లేదా మూడవ రోజు కనిపించి 5 నుంచి 7 రోజుల వరకు పెరుగుతుంది. రక్తంలో మొత్తం బైలిరూబిన్ శాతం 15 మి॥ గ్రాములకు మించదు. అదే పెథలాజికల్ జాండిస్ అయితే పుట్టిన 24 గంటలలోపే కనిపిస్తుంది. సీరమ్ బైలిరూబిన్ స్థాయి రోజుకు 5 మి.గ్రా. కంటే ఎక్కువ పెరుగుతుంది. మొత్తం సీరమ్ బైలిరూబిన్ లెవల్ రోజుకు 5 మి.గ్రా. కంటే ఎక్కువ పెరుగుతుంది. మొత్తం సీరమ్ బైలిరూబిన్ శాతం 15 మి.గ్రా. కంటే ఎక్కువ ఉంటుంది. శిశువు శరీరం అంతా పసుపు రంగులోకి మారిపోతుంది. ఈ జాండిస్ 15 రోజులు దాటాక కూడా తగ్గకుండా ఉంటుంది. శిశువు కళ్ళు, ఒళ్ళు పచ్చగా కనిపిస్తుంటే తప్పకుండా ఇన్వెస్టిగేట్ చేయాలి. రక్తంలోని బైలిరూబిన్ పరిమాణాన్ని అంచనా వేయడం ద్వారా జాండిస్‌ను, తీవ్రతను గుర్తించవచ్చు. జాండిస్‌ను సకాలంలో నియంత్రించకపోతే, బైలిరూబిన్ మెదడులో చేరి ప్రాణాపాయం కలిగించవచ్చు. దానినే కెర్నిక్టరస్ అంటారు.

ఫొటోథెరపీ అనేది జాండిస్ శిశువులకు ఉపయోగించే ఒక విధమైన చికిత్సా పద్ధతి. ఈ పద్ధతిలో శిశువును కాంతివంతమైన లైట్లు అమర్చిన ఒక పరికరంలో ఉంచడం జరుగుతుంది. లైట్స్ నుంచి వెలువడే కాంతి కిరణాలు, శిశువు శరీరంలోని బిటరుచిన్ శాతం ప్రమాద స్థాయిలో పెరిగిపోతే, శిశువు శరీరం నుంచి కొంత రక్తాన్ని తొలగించి, వేరే వ్యక్తుల నుంచి స్వీకరించిన కంపాటబుల్ గ్రూపు రక్తాన్ని అంతే పరిమాణంలో ఎక్కిస్తారు. దీనినే బ్లడ్ ఎక్స్చేంజ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అంటారు. దానివల్ల శిశువు రక్తంలోని ప్రమాదకర బిటరుచిన్ పరిమాణాన్ని తగ్గించి ప్రాణాపాయ స్థితి నుంచి శిశువును రక్షించవచ్చు. అప్పటికే బిటరుచిన్ మెదడును నాశనం చేస్తే దానివల్ల అంత ప్రయోజనం ఉండదు.

– డా॥ జి.ప్రతాప్ కుమార్, చిన్న పిల్లల వైద్య నిపుణులు

సినిమా స్టైల్లో పిల్లల మార్పిడి

* ముదిగంటి సుజాతారెడ్డి

నా దోస్తు లలిత ముఖం చాలా భయంభయంగా వుంది. భయంతో పాటు ఏడుపూ కన్పిస్తోంది దాని ముఖం మీద. ఇంట్లోకి రాగానే సోఫాలో కూలబడిపోయింది.

"ఏమైందే? అంత పరేషానుగా వున్నావ్?" అడిగాన్నేను.

"నాకు భయంగా వుందే!" అంది ఏడుపు ముఖం పెట్టి లలిత.

"సరే! అది తెలుస్తూనే వుంది నీ మొహం చూస్తే. కాని అసలు విషయమేంటో చెప్పు. ఎందుకంత గాభరా."

"మా అజయ్‌లేడా?...."

"అవును వున్నాడు... నీ కొడుకు అజయ్ గదా... ఏమైంది?" కనుబొమలు ముడివేసాన్నేను.

"నాకు భయంగా వుందే. వాడసలు నా కొడుకేనా?... అని..." కళ్ళు పెద్దవి చేసింది లలిత.

"సరిపోయింది. ఇదా కారణం నీ భయానికి, ఏడ్పుకు!" పెద్దగా నవ్వాన్నేను.

"నీకు నవ్వులాటగానే వుంటది. నాకు తెలుసు! నేనేవెూ పత్రికలో ఆ వార్త చదివినప్పట్నుంచి బేజారైపోతున్నాను." పైట చెంగుతో ముఖాన్ని విసురుకుంటూ పైకి చూసింది లలిత ఫ్యాన్ నడుస్తుందా లేదా అని.

"ఏ వార్త? పిల్లల్ని తారుమారు చేశారన్న వార్తేనా?..."

"అవునే. అజయ్‌లో నాకెప్పుడూ మా వారి పోలికలు గాని, నా పోలికలు గాని కన్పించలేదే..."

"మీ అన్నయ్య పోలికలని ఎన్నోసార్లు నువ్వే అన్నావు గదే..."

"ఏవెూనే! నిజమేనంటావా? మా అన్నయ్యలాగా వున్నాడంటావా?"

"తప్పకుండా మీ అన్నయ్య పోలికలు వున్నాయి. నీ పోలికలు కూడా వున్నాయిలే..

"అంతేగాదే మా వారు చిన్నప్పుడు ఆ విధంగానే అల్లరి చేసే వారట!" అందుకుంది లలిత.

"మరింకేం. ఇక శాంతించు!" అన్నాన్నేను చిరునవ్వుతో. "ఈ మార్పిడి జరిగే గొడవ అమెరికాలోనూ వుందే. మానవ స్వభావం ప్చ్! అంతటా ఒక్కటే" నా మాటలు విని లలిత ఆశ్చర్యపోయింది.

"పిల్లలు తారుమారు కావటమేమిటే విడ్డూరం! ఆ విధంగా పిల్లలు తారుమారెట్లా అవుతారు?"

"తారుమారు చేయదలచుకుంటే అవుతారు!"

"అంటే కావాలనే తారుమారు చేసారంటావా?" అమాయకంగా వుంది లలిత గొంతు.

"అంతేమరి! ఎవరికో మగపిల్లాడు కావాలి. అందుకే ఈ బదిలీ జరిగింది. ఇక్కడ ఈ కేసే చూడు... లలిత అనే ఆమెకు కొడుకు పుట్టాడు. మహమూదా బీకి కూతురు పుట్టింది. మహమూదా భర్తనో, అత్తగారో ఎవరో మహమూదాకు ఫైనల్ వార్నింగ్ ఇచ్చి ఉంటారు, ఈసారి కంటే నీవు కొడుకునే కనాలని. దాంతో మహమూదా భయపడిపోయి ఉంటుంది. కొడుకును ఈసారి కనకపోతే తన జీవితం నరకమైపోతుందనుకొని ఉంటుంది. అందుకే ఈ అదలా బదిలీకి పూనుకుంది. హాస్పిటల్లోని సిబ్బందికి ఏం ఆశపెట్టిందో వాళ్ళూ ఈ గేమ్‌లో పాలు పంచుకున్నారు. హాస్పిటల్లో పని చేసే వాళ్ళ సహాయ సహకారాలు లేందే ఈ పని జరగటానికి వీల్లేదు కద!..."

"అట్లా కాక పొరపాటున ఈ అదలా బదిలీ జరిగి వుందంటావా? మొత్తం మీద సినిమా కథకు పనికివచ్చే మంచి మసాలా వుంది దీనిలో." లలిత గొంతు ఉత్సాహంగా వుంది. పొరపాటున కూడా జరగొచ్చే! సినిమా ముచ్చట వస్తే లలితలో ఉత్సాహం వస్తుంది. నాకు తెలుసు. కాని ఇక్కడ మహమూదా అడ్రనస్సు సరిగ్గా రికార్డు కాకపోవడం... అబ్బాయికి బదులుగా అమ్మాయి... అమ్మాయికి బదులుగా అబ్బాయి మాయమై కన్పించడం అంతా వ్యవహారం చూస్తుంటే కావాలని అదలా బదిలీ జరిగిందని స్పష్టంగా తెలుస్తున్నది గదనే!" అన్నాన్నేను.

"అంటే నువ్వనేది ఏమిటి!... కొడుకు కావాలనే ఆశతోనో, దురాశతోనో బెదిరింపులతోనో తన బిడ్డ కాని బిడ్డను.. సొంతం చేసుకోవడానికి ఆమె సిద్ధమైందంటున్నావా?.... ఎంత త్యాగమో ఇది! ఆ పిల్లవాడు పెరిగి పెద్దవాడైతే అప్పుడు వాణ్ణి చూస్తే ఆమెకు అనుక్షణం ఆ బిడ్డ తన వాడు కాదని గుర్తురాదా? ఇదంతా ఎంత నరకంగా వుంటుందప్పుడు!" లలిత గొంతు ఆవేశంగా మారిపోయింది.

"ఇదంతా ఒక ఆడది తన సంసారాన్ని, జీవితాన్ని నిలుపుకోవడం కోసం... పురుష సంతానం కోసం తన కన్నబిడ్డనే చేసిన త్యాగం లల్లీ! కొడుకు కోసం ఏమైనా చేసే వాళ్ళుంటారని ఇప్పుడర్థమైందా నీకు"

"ఏవెూనే! ఇదంతా విని నేను జీర్ణించుకోలేకుండా వున్నాను. అందుకే నాకు పీడకలలు వస్తున్నాయి. లేనిపోని అనుమాన పిశాచాలు వెంటాడుతున్నాయి నన్ను."

"ఏది అజయ్ నీ కొడుకు కాదనేనా?..."

"అవునే!"

"వాడు కొడుకు కదనే.. కూతురయితే నువ్వు అనుమానపడ్డా అర్థముంది" నవ్వాన్నేను.

"అవును గదా! కొడుకునెవరిచ్చేస్తారు.. నాకా విషయం తట్టనే లేదు" సంతోషంగా నిట్టూర్చింది లలిత. ◆

నా స్వప్నం

నువ్వొకసారి నవ్వు
ఆకాశం కిందికి దిగివస్తుంది
నేను సముద్రంలో మునిగి
నువ్వు ఎప్పుడో వెలిగించిన
ప్రమిదలు వెదికి తెస్తాను
ఇప్పుడు నేను నవ్వలేను
నువ్వొక్క దానివే నవ్వుచాలు
నీ కళ్ళల్లో భూగోళం తిరుగుతోంది
నిన్నిపుడు ఏమీ కోరుకోను
కాని
నిన్ను విడిచి
నానీడ కదలనంటోంది
పోదాం పదా!
ఒకసారి ప్రయత్నించు
మనిద్దరం
టాంక్‌బండ్ మీద నడిచి చాలా
రోజులయ్యింది
ఈనాడు
నీ మనసులో పక్షుల గుంపులు లేవా?
నా కళ్ళల్లో చూడు
నువ్వు కొంగు ఎగరేసి
పక్షిలా ఎగురుతున్నావు
ఇది మనం చిన్నప్పుడు ఆడుకున్న పార్కు
నీ మీద కూర్చొని
ఊయలలూగుతున్నావు చూడు
నన్ను నువ్వు మరిచిపోగలవా!
రేపటి నడిరాత్రి
నీకలలలోకి వచ్చే
నన్ను ఆపగలవా!
నన్నొకసారి ముట్టి చూడు
నీ గుర్తులు తగులుతాయి
తుఫాను రాబోతోంది
ఇక వెళ్ళిపోతాను
ఇవ్వటానికి ఈ తుపాకీ తప్ప
నా దగ్గర ఏమీ లేదు
నీ అశ్రువుల్ని వొలకనివ్వకు
నా స్వప్నం రాలిపోతుంది
ఆ వెల్తురు పక్కన నిలబడు
ఎప్పుడో ఒకసారి తిరిగివస్తాను
అన్నీ విలువైన సందర్భాలే!
ఆ మేఘం
ఈ చెట్టూ
పాదాల కింది నేలా
నేనూ
నువ్వూ
ఇది ఒక అపూర్వ సన్నివేశం
వర్షనయనం
కరచాలనం బరువు
రెండుగా విరిగిపోతున్న ప్రపంచం
నీవద్ద సెలవు తీసుకుంటున్నాయి
నేను తిరిగిరాకపోతే
నా స్వప్నాన్ని [illegible]!

* ఆశారాజు

రాత్రి... ఓ రాత్రి...

రాత్రి... ఓ రాత్రి... నువ్వెళ్ళిపోకు
నన్ను ఒంటరిని చేయకు
తూర్పు నువు తెలవారి - నను తల్లడిల్లచేయకు
బోర్లాపడిన బోలినందడానికి శక్తి సాహసించదు - సహకరించదు
ఆరిన డొక్కల ఆకలి కేకలూయలూగించి ఊరిస్తున్నా
అందుకోడానికి - ఆదుకోడానికి - నేను పోరాడలేను
ఐనా - నా పోరు నీ మీద కాదు.
పాచిపోయిన మెతుకుల మీద - పోరాడే ఈగల మీద
కలబడుతున్న కుక్కల మీద - చిందరవందరైన విస్తళ్ళమీద
సాధించడానికి సాయుధుడను కాదు - నిస్సహాయుడను
ఆర్తనాదాల అరుపులు - బూట్ల చప్పుళ్ళు
విరిగిన లాఠీలు - తుపాకీ ఫీంకారాలు
ధూళిని మింగేస్తూ - దుమ్మును మోసేస్తూ
ఒకటా? రెండా? తనువంతా ఆనవాళ్ళు
ఐనా రాలని కన్నీళ్ళు - ఇంకిపోయిన నెత్తురు
లాక్కుపోయిన తోలు - ఐనా-నాపోరు
పెరుగుతున్న పోరు - బలిసిన తపన - బలమైన వాంఛ..
బ్రతకాలని - జీవాన్ని బ్రతికించాలని
రాజీపడుతూ - రాళ్ళమీద - రప్పమీద - రెప్పవాల్చి
ఆగలేక ఆకలిని అప్పుడప్పుడు హత్య చేస్తూ
దొరక్కుండ దాగుంటూ - చెత్తలో చేరుకున్న పాచికూడు
దోచుకుంటూ
పోతున్నా.. అందుకే...
రాత్రి... ఓ రాత్రి నువ్వెళ్ళిపోకు - నన్నొంటరిని చేయకు.

* ఆనంద కుమార్ వజ్జరపు

విద్యా స్ఫూర్తి నివ్వాలి

✻ వేము

సాయంత్రం బస్ వచ్చే టైమైంది. మీటింగ్ ఎప్పటికప్పుడే అయిపోతున్నట్లు అయిపోతూనే మళ్ళీ మొదలవుతోంది. నాలో కొద్దికొద్దిగా అసహనం పొంగుకొస్తోంది. "ప్రిన్సిపల్ చాలా స్ట్రిక్ట్. ఎంత స్ట్రిక్ట్ అంటే క్లాస్ జరుగుతున్న సమయంలో క్లాస్ రూంలో కొచ్చి టీచర్లని చెమట్లు పట్టిస్తాడు" స్కూల్‌లో నా అపాయింట్‌మెంట్ *తొలిరోజు ఓ మేడం* చేసిన కామెంట్. *గ్లాస్‌లో* మంచినీళ్ళు కూడా అయిపోయాయి. "మైసయ్యా ఓ బాటిల్ మంచినీళ్లు తీసుకురా" నా అసహనాన్ని గమనించిన లెక్కల మాష్టారు అటెండర్‌ని ఆజ్ఞాపించాడు.

"క్రమశిక్షణ చాలా అవసరం" చదువుదే ముంది ఎప్పుడైనా చెప్పొచ్చు. పిల్లలు చేయిజారేంతగా మనం నిద్రపోవద్దు. ప్రతీక్షణం వాళ్ళని ఓ కంట కనిపెడుతుండాలి. ఇదేం ప్రభుత్వ పాఠశాల కాదు. ప్రతి పిల్లవాడి తల్లిదండ్రులు మనల్ని ప్రశ్నిస్తుంటారు. జవాబుదారీతనం ఎంతైనా అవసరం. చదువు గట్టిగా చెప్పాలి. అసలే పరీక్షల సమయం వచ్చింది. పదోతరగతి వాళ్ళని ఏ మాత్రం మెసల్నీయొద్దు. ర్యాంకొచ్చే వాళ్ళని మరింతగా చదివించాలి. నాకు రిజల్ట్స్ ముఖ్యం. మీరేం చేస్తారో నాకనవసరం. ఎల్.కె.జి. వాళ్ళకి గోడ కుర్చీయే సరైన శిక్ష. బెత్తాలతో కొట్టొద్దు. చేతులపై దెబ్బలు ఎరుపెక్కి మొన్నీ మధ్య అదో పెద్దసమస్య అయింది. క్రమశిక్షణ విషయంలో ఏ మాత్రం రాజీ లేదు "వేలకువేలు గుమ్మరిస్తున్నాం. మీరేం నేర్పుతున్నారో ఏమో ఇంటిదగ్గర మా పిల్లాడు ఒకటే అల్లరి" అంటూ ఉదయం ఓ పేరెంట్ కంప్లయిట్.

ప్రిన్సిపాల్ నీళ్ళని గుటకేస్తూ ఇంకా ఏదో చెప్పబోయాడు. ఇంతలో ఫోన్. మాక్కాస్త రిలీఫ్. అవతల ఏమహానుభావుడు ఫోన్ చేశాడో. మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను. సరే సరే ఇంకా ఏమైనా సజెషన్స్ ఉంటే మీరు ఇవ్వండి. అవతల అర్జంట్ పనుందంటూ మీటింగ్ క్లోజ్ చేశాడు ప్రిన్సిపాల్.

'క్రమశిక్షణ', 'గోడకుర్చీ', 'ఇంటిదగ్గర పిల్లాడు అల్లరి' - దానికి ఉపాధ్యాయుల క్రమశిక్షణ నేర్పుపై కంప్లయింట్. ప్రిన్సిపాల్ మీటింగ్‌లో మాట్లాడిన మాటలు కందిరీగల్లా తిరుగుతున్నాయి.

క్రమశిక్షణ విద్యార్థులకి అవసరమే. కాదనను కానీ క్రమశిక్షణ పేరుతో పసి హృదయాల్ని గాయపరచడం ఎంతవరకు సబబు. ఇంతకీ ఇప్పటికీ నాకర్థం కానిది అసలు 'క్రమశిక్షణ' అంటే ఏమిటి ?

కోదండమేయడమా? బెత్తాలతో కొట్టి చెప్పడమా? గోడకుర్చీ వేయడమా?? మరేంటి ? క్రమశిక్షణంటే గుర్తొచ్చింది. పాపం మొన్న ఆ యు.కే.జి. అమ్మాయి అర్చన గేమ్స్‌టైంలో తోటి అమ్మాయిని కొట్టిందని మరో టీచర్ చితక కొట్టాడు. ఈసారి కొడతావా? ఈసారి ఎవరి జోలికైనా వెడతావా?? అంటూ దెబ్బమీద దెబ్బ. అది చూసి నా మనస్సు విలవిలలాడింది. పాపం అర్చన. ఏడుపు కూడా ఉగ్గబట్టుకొని ఏడ్చింది. ఏడవడానికి స్వేచ్ఛలేదు. ఈ కంప్యూటర్ యుగంలో అన్నీ హామ్‌ఫట్. స్వేచ్ఛగా మాటల్లేవు. పరిపూర్ణంగా నవ్వులూ లేవు. మనమంతా ఓ మూగ తరానికి ట్రైనింగ్ ఇస్తున్నామేమోననిపిస్తుంది ఒక్కోసారి నాకు.

విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌తో మాట్లాడుతుంటే బలే నవ్వొస్తుంది నాకు. నిన్న సృతి వాళ్ళ నాన్న మాటలు నాలో నేనే తెగ నవ్వుకున్నారు. "మా అమ్మాయికి ఇప్పటి నుండీ మాథ్స్‌లో పర్‌ఫెక్ట్ చేయాలి మీరు. ఆటలు, పాటలు అంటూ కాలం వెళ్ళబుచ్చొద్దు. అవసరమైతే ప్రైవేట్ క్లాసులు కూడా తీసుకోండి. హోమ్‌వర్క్ ఇవ్వడంలో ఈ మధ్య నిర్లక్ష్యం చేస్తున్నట్లు కన్పించింది. మీ సంజాయిషీ నాకనవసరం. నా కూతురు పదవ తరగతిలో స్టేట్‌ర్యాంక్ కొట్టాలి. కంప్యూటర్‌లో అందెవేసిన చేయిగా తయారవ్వాలి. ఫీజు ఎంతైనా ఫర్వాలేదు. స్పెషల్ టీచర్స్‌ని పెట్టండి. ఇంకా ఏవేవో మాట్లాడాడు కానీ వినడం నా వల్లకాక స్టాఫ్ రూంలోంచి లేచి బయటకొచ్చేశాను.

సదరు వ్యక్తి రెండు చేతులా సంపాదిస్తున్న లాయరని తెల్సింది. సరే తండ్రిగా తన కూతురు గొప్పదవ్వాలని కోరుకోవడంలో తప్పులేదు. కానీ యు.కె.జి. చదివే పిల్లమీద అంతభారం మోపడం అవసరమా? ఆ పిల్లది ఎంత వయస్సు ? మా అయితే నాలుగేళ్ళు నిండలేదు. ఆటలతో, పాటలతో గడపాల్సిన వయస్సు. లెక్కలంటూ, కంప్యూటర్లంటూ వాళ్ళ మెదళ్ళని రాబోట్ సర్క్యూట్స్‌గా తయారు చేయడం ఎంతవరకు సమంజసం. కనీసం ఆగస్టు పదిహేనో, జనవరి ఇరవై ఆరునో ఆటలాడిస్తే ఏదో మునిగిపోయిందని పరుగులు తీస్తూ వస్తారు వీళ్లు. చదువేదో అక్కడితో కుంటుబడుతున్నట్లు. ఈ పోటీ ప్రపంచంలో తన పిల్లవాడు వెనకబడ్తాడన్నట్లు తెగ హైరానా పడ్తారు.

కానీ ఈ లేత హృదయాలపై కలిగించే ఒత్తిడి వాళ్ళలో సృజనాత్మకతను దెబ్బతీస్తుందని గ్రహించడం లేదు. వచ్చే తరంలో ఏ విద్యార్థయినా చదువుల్లో ఫస్ట్. కానీ తన జీవితంలో ఏ సమస్యనైనా ఒంటరిగా ఎదుర్కొనే స్థయిర్యాన్ని ప్రదర్శించగలడా?? కనీసం తాను రోజూ ఎక్కే స్కూలు బస్ మిస్సయితే ఒంటరిగా వేరే బస్సులో ఇంటికి చేరుకోగలడా?

ఎప్పటికీ చదువు.. చదువు.. స్కూల్ ఫస్ట్, డిస్ట్రిక్ట్ ఫస్ట్... స్టేట్ ఫస్ట్... పరీక్షలు... ఫస్టులు.. ఫస్టులు పరీక్షలతోనే వాళ్ళ జీవితం తెల్లారిపోతుంది. అసలు జీవితమంటే ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్లు సంపాదించడమేనా?? రోజురోజుకీ పరీక్షల్లో తప్పామనో, అనుకున్నన్ని మార్కులు రాలేదనో, ర్యాంక్ మిస్సయిందనో, అమ్మతిట్టిందనో, నాన్న కొట్టాడనో, తన తోటి వాళ్ళు నవ్వారనో, ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ఆత్మన్యూనతా భావంతో ఇక తాము ఎందుకూ పనికి రామనే ఆలోచనలతో తమలో తాము కృంగి పోతుంది విద్యార్థి లోకం. సృజనాత్మకతను వెలికితీసే విద్యయే దీనికి సరైన సమాధానం. స్వేచ్ఛనిచ్చే విద్యావిధానమే మార్కుల చదువుకు సమాధానం అవుతుంది.

గాడిద బరువుల చదువుల్లో సారం లేదని గ్రహించిన నాడే నిజమైన ప్రతిభను పిల్లల నుండి పొందగలం. వాళ్ళకి ఇష్టమైన చదువుల్ని చదివించడమే వాళ్ళకిచ్చే గొప్ప భవిష్యత్. అప్పుడే వాళ్ళలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించిన వాళ్ళమవుతాం. ◆

విందు

అదో అందాల అడవి. ఆ అడవికి రాజు సింహం. దానికి ఓ బుల్లి సింహం పుట్టింది. ఆ సందర్భంగా అడవిలోని జంతువులన్నీ కలిసి విందు ఏర్పాటు చేశాయి. అందుకు కావలసిన పండ్లు, రొట్టెలు, కాయలు తెచ్చాయి. తేనెటీగలు తేనె తుట్టెలను తీసుకొచ్చాయి. పక్క అడవినుంచి కొన్ని జంతువులను పిలిచాయి.

పక్క అడవినుంచి కోతి, కుక్క, ఏనుగు విందుకు బయలుదేరాయి. ఒక చెట్టుమీదనుంచి మరో చెట్టుమీదకు దూకుతూ కోతి ముందుగా విందుకు హాజరైంది. అది సింహం పిల్లను చూసి ముద్దు చేసింది. చక్కగా విందారగించింది. తిరుగు ప్రయాణమైంది. కొంత దూరం వెళ్లాక తన పిల్లలు గుర్తొచ్చాయి. వెంటనే వెనక్కు వెళ్లి సింహాన్ని అడిగి కొన్ని రొట్టెలు తీసుకుని బయలుదేరింది. సంతోషంగా వెళుతూ వుండగా అరటిపళ్ల తోట కనిపించింది. తోటనిండా పళ్లే బాగా పండి కళ్లకింపుగా వున్నాయి. పైగా సువాసనలు వెదజల్లుతున్నాయి. నోరూరింది. 'నాలుగు పళ్లు కోసుకువెళితే పిల్లలు తింటారుకదా' అనిపించింది దానికి. వెంటనే తోటలోకెళ్లింది. చేతిలో వున్న రొట్టెలను గట్టుమీద పెట్టి చెట్టు ఎక్కింది. ఇంతలో అటుగా వెళ్తున్న జిత్తులమారి నక్క ఆ రొట్టెలను చూచింది. వెంటనే వాటిని తీసుకుని పారిపోయింది.

అరటిపళ్లు కోసుకుని కిందకు వచ్చిన కోతికి రొట్టెలు కనిపించలేదు. పాపం చాలా సేపు వెతుక్కుంది. కాని అవి కనిపించలేదు. ఎవరో తీసుకువెళ్లారనుకుంది. ఇంతలో ఒక చెట్టు దగ్గర రొట్టెముక్కలతో నక్క కనపడింది. కోతి నక్కను రొట్టెముక్కలు యిమ్మని అడిగింది. కాని నక్క కోపంగా 'ఇవి నావి. నీకెందుకివ్వాలి?' అని ప్రశ్నించింది.

ఇంతలో విందులో పాల్గొనటానికి వెళుతున్న కుక్కకు అవి రెండూ కనిపించాయి. కుక్క కోతితో 'ఏంటి బావా! అలా వున్నావు? నీకు ఏమైంది? విందు జరగలేదా? ముందుగా విందుకు వెళ్లావుకదా' అని అడిగింది. దానికి కోతి 'అదికాదు కుక్కబావా! నేను విందుకు వెళ్లడం నీకు తెలుసుకదా. అక్కడ సింహం రాజుగారు నా పిల్లలకోసం కొన్ని రొట్టెముక్కలు ఇచ్చారు. దారిలో పళ్లతోట కనిపిస్తే వాటిని కిందపెట్టి చెట్టు ఎక్కాను. వాటిని ఈ నక్క కాజేసింది. ఇమ్మంటే ఇవ్వడం లేదు' అంది దిగాలుగా. కుక్కకు కోతిని చూసి జాలి వేసింది. 'ఏంటి? మా కోతి బావ రొట్టెముక్కలు తీసుకున్నావంట. ఇచ్చేసేయ్' అంది. కాని 'ఇవి నావి నేను విందుకు వెళ్లాను. నేను రొట్టె తెచ్చుకున్నాను' అంది నక్క.

అంతలో విందు ముగించుకుని అటుగా వస్తున్న ఏనుగుకు ఈ జంతువులన్నీ కనిపించాయి. ఏనుగును చూడడంతోటే కుక్క సంతోషంగా 'హా...! ఏనుగుబావా వచ్చావా? చూడు కోతి రొట్టె ముక్కలను నక్క తీసుకుంది. అడిగితే విందుకెళ్తే ఇచ్చారని బుకాయిస్తోంది. నక్క విందుకు వచ్చిందా?' అని అడిగింది. 'ఏంటి నక్క విందుకు వచ్చిందా? రాలేదే! ఛీ... అబద్ధాలు చెప్పి కోతి పిల్లల నోటి దగ్గర రొట్టెముక్కలు కాజేయడానికి సిగ్గుగా లేదూ' అంది. ఆ మాటలతో అక్కడున్న జంతువులన్నీ పకాలున నవ్వాయి. అప్పుడు సిగ్గుతో తల దించుకుని కోతికి క్షమాపణలు చెప్పింది. అంతేకాక రొట్టె ముక్కలు ఇచ్చేసి వెళ్లిపోయింది నక్క.

చిల్లంచర్ల వెంకటసాయి



క్విజ్-58

1. కాళిదాసు పేరు పొందినది?
   ఎ. రాజకీయవేత్తగా బి. నాటకకర్తగా
2. పింప్రీలో నిర్మించిన కర్మాగారము?
   ఎ. విద్యుత్ బి. రసాయనాలు
3. 'ఎడారి ఓడ' అని దేనిని పిలుస్తారు?
   ఎ. గుర్రము బి. ఒంటె
4. పత్తిపంటకు అనుకూలమైన నేల?
   ఎ. నల్లరేగడి బి. ఇసుకనేల
5. 25ను రోమన్ సంఖ్యలో రాయుండి?
   ఎ. XXV బి. XX1
6. పాముల వలె వానపాములకు ఏమి వుండదు?
   ఎ. చర్మం బి. వెన్నెముక
7. ఉత్తరప్రదేశ్ రాజధాని?
   ఎ. లక్నో బి. త్రివేండ్రం
8. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎక్కడ వుంది?
   ఎ. విజయవాడ బి. హైదరాబాదు
9. గొప్ప సినీ నటుడు?
   ఎ. చార్లీ చాప్లిన్
   బి. బ్రహ్మానందం
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. మాకినేని బసవపున్నయ్య
   బి. పుచ్చలపల్లి సుందరయ్య

చిన్నారి చిత్రకారులు

ఎన్.కృష్ణవేణి, 8వ తరగతి, రవితేజ పబ్లిక్ స్కూల్, శ్రీనగర్, కాకినాడ.

సుందరరామయ్య, 8వ తరగతి, విశాఖపట్టణం.

గోపాలం నాగశిరీష, 7వతరగతి, అరవింద హైస్కూలు, కుంచనపల్లి, గుంటూరు.

కె.అనిత, 10వతరగతి, సుధా విద్యాలయం, వైరా.

నేనెవరిని!

నేను ఫ్రాన్స్‌కు చెందినవాణ్ణి. 1736-1819 మధ్య జీవించాను. విద్యుత్తులో రోజువారీ వాడుకునే ఒక ప్రమాణానికి నా పేరే వుంది. ఆవిరి ఇంజన్‌ను అభివృద్ధి చేశాను.మరి నేనెవర్ని?

[illegible]

డా.కాకర్లమూడి



క్విజ్ 57 జవాబులు

1.సరోజినీ నాయుడు 2. మూడు వైపులా నీరు వుండడం 3. ఉన్ని తివాచీలు 4. కంగారు 5. −3 6. పొరుడు 7. అగర్తల 8. కారు 9. గాజు 10. కలామ్

★

క్విజ్ 56కి సరైన సమాధానాలు రాసిన వారు :

జాడ విజయలక్ష్మి, 5వ తరగతి, ఉత్తరాపల్లి, విజయనగరం. **ఎల్.స్రవంతి, 5వ తరగతి**, మద్దిపాడు, ప్రకాశం. **కాలువ తన్మయ**, అరండల్ పేట, గుంటూరు. **జి.వెంకయ్యచౌదరి**, 8వ తరగతి, **జి.నీహారిక**, 9వ తరగతి, లక్ష్మినగర్, మెదక్. **వెలుగు సురేంద్ర**, 10వ తరగతి, విద్యానగర్, హైదరాబాదు. **పి.షహనాజ్ నల్మా**, 9వ తరగతి, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.

చేతికి

నేను చె
ఓ మేజిక్ తెలుస్తుం
అయి
తీసుకోండి. దాన్ని
చుట్టండి. ఇప్పు
పట్టుకుని కుడి చేతిపై
చెప్పినట్టు చేస్తున్నా
గొట్టములోంచి కు
ఏం కనిపించింది?
పడింది. ఇప్పుడెలా
అసలు
లేదు. అలా వున్న
అంతే. ఎలాగంటే
లోపలికి చూస్తుం
చేతిని చూస్తుంది.
మన
పట్టించాలంటే...
రంధ్రం పడిందని
చెప్పండి. మీకు తె
అబ్రకదబ్రా... చె
గొట్టాన్ని వాళ్ల కం
అసలు విషయం
చెప్పేయండి. మళ్లీ
మీ స్నేహితులకు

రం



ంధ్రం

...న్నట్టు చేస్తే మీకు
...వి. మరి చేస్తారా!
...ఒక న్యూస్‌పేపరు
...న్నని గొట్టంలాగా
...ు ఎడమచేత్తో
...ద పెట్టండి. ఏంటి
...గా! అ... ఇప్పుడు
...చేతిని చూడండి.
...అమ్మో చేతికి రంధ్రం
...?' అనుకుంటున్నారా?
...మి చేతికి ఏ రంధ్రమూ
...భ్రమ పడుతున్నారు
...ఒక కన్ను గొట్టము
... మరో కన్ను తిన్నగా
...అప్పుడు చేతికి రంధ్రము వున్నట్టు కనిపిస్తుంది. అవునా!
...ళ్లు మనల్ని మోసం చేయడమంటే ఇదే. మీ మిత్రులను ఒక ఆట
...గొట్టములోంచి చేతిని చూడమనండి. వాళ్లు కూడా మీలాగే చేతికి
...యపడతాడు. అప్పుడు మంత్రం వేసి మామూలు చేతిలాగా చేస్తానని
...సుగా అబ్రకదబ్రా మంత్రం. ఏదీ ఒక్కసారి చెప్పండి. 'అబ్రకదబ్రా...
...య మామూలుగా రావాలి దబ్రా' అనండి. అంటే సరిపోదు. పేపరు
... దగ్గరనుంచి తీసేయండి. అంతే... కానీ పాపం వాళ్లకు కూడా
...లియాలిగా. అందుకని కాసేపు ఏడిపించాక అసలు విషయం
...చ్చేవారం మరో మేజిక్ చెప్పుకుందాం. అందాకా పాత మేజిక్‌లను
...ప్తుండండి.

కలంస్నేహం

పేరు: యం.జ్యోతి,
వయసు : 12 సం॥
చదువు :8 వతరగతి
హాబీలు :చదవడం, రాయడం, కబడ్డీ, స్కిప్పింగ్ ఆడడం.
పూర్తి చిరునామా : యం.జ్యోతి, అడ్డగుట్ట, ఇం.నెం: 10-4-ఎ/130/సి, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాదు.

పేరు:డి.వనజాజ్యోతి,
వయసు :13 సం॥
చదువు :8 వతరగతి
హాబీలు: పేపరు చదవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా :డి.వనజాజ్యోతి, డాటరాఫ్ డి.వి.ఆర్. నాయుడు, గవరపాలెం, ఇం.నెం: 18-6-14, అనకాపల్లి, 531003.

నెమలి కోయిల



నా కథ

ఒక అడవిలో నన్నీ అనే నెమలి, కుహూ అనే కోయిల వుండేవి. నన్నీకి అందంగా వుంటానని చాలా గర్వం. కుహూను చూచి 'నీవు చూడు ఎంత నల్లగా వున్నావో. మసి బొగ్గులా, భూడిద బుచ్చమ్మలా' అని హేళన చేసేది., అంతటితో ఆగక పురివిప్పి 'నన్ను చూడు ఎంత అందంగా వున్నానో!' అని మురిసిపోయేది. పాపం కుహూ ఇవన్నీ మౌనంగా వినేది. దానికి కాలం కలసివస్తోందనుకుని సర్ది చెప్పుకునేది. ఒకరోజు సాయంత్రం చాలా చల్లగా హాయిగా వుంది. ఆ సంతోషంలో కుహూ తన తియ్యటి గొంతుతో పాడింది. ఆ ఆహ్లాద సమయాన కోయిల పాట విని జంతువులన్నీ సంతోషించాయి. కోయిల పాట విన్న నెమలికి కోపం వచ్చింది. 'అదేనా ఏంటి పాడేది? నేనూ పాడగలను' అని మెడ వంకరగా పెట్టి మరీ ఓ పాట పాడింది. ఆ శబ్దం ఏంటో అర్థంగాక జంతువులన్నీ భయపడి అటూ ఇటూ పరిగెట్టాయి. వాటి పిల్లలైతే దడుచుకుని వణుకుతూ నేలకు అతుక్కుపోయాయి. నిద్రలోవున్న జంతువులైతే ఉలిక్కిపడి లేచాయి. 'ఎవరు? ఆ శబ్దం చేసింది ఎవరు?' అని అడుగుతూ చివరకు నన్నీ దగ్గరకు వచ్చాయి. 'ఇందాక ఆ భయంకరమైన శబ్దం చేసింది నువ్వేనా' అని ప్రశ్నించాయి. దానికి నన్నీ వయ్యారంగా తోక ఊపుకుంటూ 'అవును. నేనే. ఆ కుహూకేనా ఏంటి పాటలు వచ్చేది? నాకూ వచ్చు. అది తెలియచెప్పాలనే పాడేను. ఎలా వుంది?' అంది. జంతువులన్నీ ఆశ్చర్యంగా 'అది పాటా...! చూడు మా పిల్లలు ఎలా భయపడి వణికిపోతున్నాయో? పాటంటే.... ఇందాక కుహూ పాడిందే అది. ఇంకెప్పుడైనా ఇలాంటి కర్ణకఠోర శబ్దాలు చేశావంటే అడవినుంచి తరిమేస్తాం. చక్కగా పురి విప్పి డాన్స్ చేయి. చూసి ఆనందిస్తాం. నిన్ను అభినందిస్తాం' అని హెచ్చరించాయి. అప్పుడు నన్నీకి తన పొరపాటు తెలిసివచ్చింది. వెంటనే కుహూను క్షమాపణ కోరింది. అప్పటినుంచి నన్నీ, కుహూ కలసిమెలసి వుండసాగాయి.

బి.సుభాషిణి, 9వ తరగతి, రాహుల్‌పబ్లిక్‌స్కూల్.

> చిన్నారులూ...
> సొంతగా కథ రాసి పంపిస్తే 'నా కథ' శీర్షికలో ప్రచురిస్తాం. పది వాక్యాల్లో రాయాలి. పాత కథలను చూసి రాయకండే. మరి మీ కథలకోసం ఎదురుచూస్తూ.....
> బాలనేస్తాలు

...గులు వేద్దామా!



పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	వలి
	టుక
	వడి
	నుక
	సు
	రు

గతవారం జవాబులు

ము	సలి
	రికి
	రిపం
	లికి
	చ్చట
	సురు

కింకర కలకలం

✻ రుక్మిణి

ఆ రోజు మధ్యాహ్నమయ్యేసరికి ఆ గవర్నమెంటు హాస్పిటల్ ఆవరణ మరింత కలకలంగా... గందరగోళంగా గొడవగా ఉంది. చెట్ల కొమ్మల మీదా... ప్రహరీగోడల మీదా... కిటికీ చువ్వలు పట్టుకుని... వరండా స్తంభాల మీదా... అబ్బో... ఒకటే కలకలం..!

లోపల హాస్పిటల్ వార్డుల్లో చూద్దామంటే వట్టుమని పాతికమంది రోగులు మంచాల వంటి పెట్టుకుని... ప్రాణాలు బిగబట్టుకుని బిక్కుబిక్కుమంటూ 'రోగం' కన్నా మరింత భయభ్రాంతులవుతూ పడి వున్నారు.

యమలోకానికి ఏ శాటిలైటు చానల్ ద్వారా వార్త చేరిందోగానీ... యమకింకరులు... కింకిణులు ఈలలు.. గంతులు వేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల నిండా చేరిపోయి, కీసర బాసరగా జోకులేసుకుంటూ... రోగుల వంక బహు ఆబగా చూస్తూ డాన్సులు కూడా చేస్తున్నారు.

"చంద్రబాబుగారు అధికారంలోకి వచ్చి తర్వాత మనకు భలే గిరాకీ తగిలింది మావా..." ఓ యమ కింకిణి... ఓ కింకరుడితో హాస్యమాడింది "అవును గదే... అనంతపురం... వరంగల్ రైతుల దరిద్రం... అప్పుల దెబ్బకు మన యమలోకం మొత్తం వాళ్ళతోనే నింపి పారేస్తిమి – ఒకటే ఆత్మహత్యలాయె! ఉరితాళ్ళు.. విషాలు మింగుడాయె!" మరో ముసలి కింకరుడు వికారంగా పళ్ళికిలించి కిటికీ మీద నుండి చెట్టు కొమ్మ మీదికి గెంతాడు.

"ఈ జి.వో. 90 ధర్మమా అని మనకు చేతుల్నిండా పని... ఆస్పత్రుల చుట్టూ మన యమకింకరులు మొత్తం వాలిపోయినారు. పేదోడికి ఏదో ఒక జబ్బంటూ వస్తే చాలు.. వాడు సుబ్బరంగా ఎగిరి మన చేతుల్లో పడ్డట్లే..." ఓ కింకరి బహుసంబరంగా గెంతింది.

అపుడే అయిదవ నెంబరు వార్డులో నాలుగో బెడ్ మీద పేషెంటు నర్సింహ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని... బిక్కుబిక్కు మంటున్నాడు. కడుపు నొప్పికి ఆపరేషన్ చేసినట్లుంది – కుట్లు సరిగా వేశారో లేదోగానీ... వుండుండి కలుక్కుమంటుంది. అరుద్దామంటే ఓపికలేదు. ఓపిక తెచ్చుకుని అరిచినా పట్టించుకునే వాడు లేడు. అధవా... ఏ కాంపౌండరో వచ్చి "ఏమయిందమ్మా" అని ఓ మాట అడిగితే చాలు... దానికి అదనంగా మరో పదిరూపాయలు యూజర్ ఛార్జీ చెల్లించాలి. ఇప్పటికే తడిసిమోపెడై పెండ్లాం మెడలో మంగళసూత్రంతో సహా అన్నీ అమ్మిపారేసి ఈ ప్రభుత్వ హాస్పిటల్ వారి ఛార్జీలను భారీగా చెల్లించి కట్టుబట్టల్తో... కడుపు మంటతో పక్కనే పీక్కుపోయి దిగాలు పడుతున్న పెండ్లాంతో అట్లా మంచంమీద పడి మూలుగుతున్నాడు.

"వట్టండి... వట్టంద్రో... జల్దీ... ఆలస్యమైపోతంది... అవతల ఎమర్జన్సీ... కార్పొరేట్ డాక్టర్ గారి పేషెంటు.. ఆపరేషన్ చేసింద్రు... అక్కడ బెడ్‌లు... రూంలు ఖాళీలు లేవంట... పది రెట్లు డబ్బు కట్టి, కంప్యూటరు రసీదు తీసుకున్నాడు. ముందు ఈడ్ని బెడ్డు మీద నుండి లాగి దబ్బున బయట పారనూకాలె..."

బిలబిలమని ఆస్పత్రి సిబ్బంది హడావుడిగా నర్సింహను పీనుగును లేపినట్లు లేపి... ఈడ్చి ఆస్పత్రి వరండాలోకి విసిరి పారేశారు. నర్సింహ అర్థంగాక హడలి పోవడంతో పుటుక్కున పక్కనే గోడమీద నిక్కి చూస్తున్న కింకరుడు చెంగున గెంతి వాడి ప్రాణాలు ఒడిసి పట్టుకుని ఆకాశంలోకి ఆనందంగా రివ్వున దూసుకెళ్ళి పోయాడు. మిగిలిన కింకరులు ఆనందంలో చప్పట్లు చరిచారు.

ఇక శరభయ్య కడుపులో ఎద్దుకుమ్మింది. కొమ్ములాగా దిగబడి పోయి పేగులు రెండు కాస్తా తెగిపోయినట్లున్నాయి. ఆపరేషన్ థియేటర్లో డాక్టర్లు తమ ప్రాణాలకు తెగించి ఆపరేషనుకు సిద్ధపడిపోయారు. ఎట్లాగోలా రెండు పేగులూ అతికించి ఊపిరి పీల్చుకున్నాక వాళ్ళకో పెద్ద ధర్మ సందేహం పట్టుకుంది. చీల్చిన పొట్టను తిరిగి కుట్టాలా... లేక ఆ భారీ ఖాళీ రంధ్రాన్ని, వేలాడుతున్న పేగుల్ని అట్లాగే వదిలేయాలా.. అని తర్జనభర్జనలు పడి చివరికి పొట్టను తిరిగి కుట్టడమే నబబనే నిర్ణయానికి వచ్చేశారు. వెంటనే బయట శరభయ్య తాలూకు బంధువులను పిలిచి "అర్జంటుగా సూదులు... కుట్టడానికి స్పెషల్ దారం కొనుక్కురావాలి... పైగా 'కుట్టుకింత' అని యూజర్ ఛార్జీలు చెల్లించి రసీదు పొందాల్సిందిగా మొత్తం లెక్కలు గట్టి టోటల్ పైకం చెల్లించమని తాకీదు ఇవ్వడంతో వాళ్ళంతా హాహాకారాలు చేశారు. ఒకళ్ళిద్దరు మాత్రం అమాంతంగా వెనక్కు విరుచుకు పడిపోయినారు.

"హమ్మో... అంతడబ్బే... తిండికి లేని పేదముండాకొడుకు శరభయ్య కడుపు మండిన ఎద్దు కుమ్మేసింది గదా.. మా ఎవరిదగ్గిరా నయాపైసా కాదు కూడా లేవు... అయినా ఇది గవర్నమెంటు ఆస్పత్రి గదా... ఇట్లాంటివి మన ప్రభుత్వమే చూసుకోవాలి గదా... ఇదేం పద్ధతి?" ఓ ముసలి బంధువు ఉద్రేకంగా వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడ్డా వాళ్ళలో కనికరం మాత్రం తొంగిచూడలేదు.

"హడయ్యా... గవర్నమెంటు... జి.వో. 90... పూరాగా చదువు... మేం నిమిత్తమాత్రులం... ఆసుపత్రులన్నీ ప్రైవేటీలగా మార్చిపారనూకారు – మన చంద్రబాబుగారు – దాని ప్రకారం రోగులతో... రోగాలతో గవర్నమెంటు వారికి ఎలాంటి సంబంధం లేదు. ఉంటే గింటే అటు ప్రపంచ బ్యాంకుతో ఇటు యూజర్ ఛార్జీలతోనే సంబంధం" అని ఓ కుర్ర డాక్టరు చాలా ఓపిగ్గా వివరించడానికి సిద్ధపడగానే శరభయ్య బంధుజనం లబోదిబోమన్నారు. ఈ లోపునే పగిలి విచ్చుకున్న కడుపుతో వున్న శరభయ్య శరీరాన్ని బరబరా ఈడ్చుకుంటూ తెచ్చి వరండాలో పారనూకారు. చివరిసారిగా ఓపిక తెచ్చుకుని లబలబలాడాడు. కిటికీ ఊచలకు వేలాడుతున్న కింకిణి వెంటనే ఆనందంతో శరభయ్య ప్రాణాలను గుప్పిటందుకుని ఆకాశంలోకి ఎగిరిపోయింది – మిగతా కింకరులు వికవికా గెంతులు గెంతారు.

గోపయ్య మూడోవార్డులో రెండో బెడ్డు పేషంటు... చాలా నీరసించి పోయి వున్నాడేమో ఎవరో డాక్టరు మహానుభావుడు గ్లూకోజు సీసానుండి సూది నరంలోకి ఎక్కించి హడావుడిగా ఎటో వెళ్ళిపోయాడు – చుక్కలు చుక్కలుగా గ్లూకోజు ఎక్కడం దిగడం అయిపోయింది గానీ దాన్ని పీకేయడానికి ఏ డాక్టరూ ఎవరూ లేకపోవడం వల్ల రక్తం గొట్టంలోకి ఎక్కడం మొదలవంగానే గోపయ్య తేరుకుని గావుకేక పెట్టాడు – కిటికీలో నుండి కింకరుడు పరమానందంగా గోపయ్య ప్రాణాలు దొరకబుచ్చుకుని రివ్వున యమలోకానికి దూసుకుపోయాడు.

"వాట్ డాక్టర్... గ్లూకోజు స్టార్టు చేసి – పూర్తవగానే క్లోజ్ చేయకుండా వుండకపోతే డేంజర్ గదా!" పెద్ద డాక్టరు గదమాయించాడు.

"చాలు చాల్లేవయ్యా బడాయి. నేను కంట్రాక్టు డాక్టర్ని. గంటలు లెక్కగట్టి నాకు డబ్బు లిస్తున్నారు. నిమిషాలు లెక్కించి నేను నా పని చేస్తానంతే!" కుర్ర డాక్టరు అతి నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు.

* * *

అక్కడ యమలోకంలో యమధర్మరాజు గారికి అట్లా చేతినిండా చావుల దెబ్బకు పని బాగా దొరకడంతో పరమానందంగా వుంది. అయితే వున్నట్లుండి ఆయనగారికో ధర్మసందేహం పుట్టుకొచ్చింది.

"చిత్రగుప్తా.. అసలింత మంది ప్రాణాల్ని మనకింకరుల ద్వారా తెప్పించుకుంటున్న నేను గొప్ప వాడ్నా – ప్రపంచ బ్యాంకు ఆదేశాలు అమలు చేస్తూ ఇంతమంది పేదజనాల్ని సుబ్బరంగా మన చేతికందిస్తున్న చంద్రబాబు గొప్పవాడా? వివరించవలెను!"

చిత్రగుప్తుడు బుర్ర తడుముకున్నాడు. ◆



ముష్టి థియరీలు

* లక్ష్మి

ఒక పిట్టకథ మనవి చేసుకుంటాను. ఒక తండ్రి. పొదుపు చేయడంలో పెద్ద ఘనాపాటి. అతనికో కొడుకు. తండ్రిగారి సిద్ధాంతానికి కట్టుబడి వున్నాడు. అంచేత ఇద్దరూ పొదుపు చేయడంలో పోటీ పడి బతుకుతున్నారు! తండ్రిగారు మునిసిపాలిటీలో పని చేస్తున్నారు. అబ్బాయిగారు పెట్రోలు బంకులో కొలువు చేస్తున్నారు. ఏ రోజుకి ఆ రోజు ఎంతపొదుపు చేసిందీ ఒకర్తో ఒకరు చెప్పుకుని ఆహా ఓహో అంటు ఒకర్నొకరు మెచ్చుకోడం వాళ్ళ నిత్యకృత్యం! ఒకరోజు అబ్బాయిగారు చెమట్లు కక్కుతూ ఇల్లు చేరుకున్నాడు. ఏంటి కథా అని తండ్రిగారు ఎంతో కుతూహలంగా అడిగేరు. ఇవాళ పదిహేను రూపాయలు ఆదా చేసేనన్నారు అబ్బాయిగారు. భేష్ బాగుపడతావని తండ్రి ఆశీర్వదించి - అంతడబ్బు ఎట్లా ఆదా చేయగలిగేవని అడిగేరు. పెట్రోల్ బంకులో నా డ్యూటీ అయిపోయిం తర్వాత ఒక ఆటో వెనక పరుగెత్తుకుంటో ఇల్లు చేరుకున్నానన్నాడు కుమారరత్నం. ఆటోవెనక పరుక్కీ పదిహేను రూపాయల ఆదాకి లింకేమిటని తండ్రిగారు ప్రశ్నించేరు! ఆటోలో కూచుంటే ఆటోఛార్జీ పదిహేను అయ్యేది! దానివెనక పరుగెత్తుకుంటో వచ్చేను గనక - ఆ పదిహేనురూపాయలూ మిగిలేయి అన్నాడు సుపుత్రుడు! ఆ మాటకి సంతోషించవలసిన తండ్రిగారు కళ్ళెర్రచేసేడు! ఆ పరుగు పందెం టాక్సీతో పెట్టుకుంటే ఏభై రూపాయలు ఆదా అయ్యేదిగదాని కోప్పడ్డారు! అబ్బాయిగారి మెదడ్లో బల్బు వెలిగింది. రేపు ఆ పనిమీదే ఉంటానని మాట యిచ్చేట్ట!

ఈ పిట్ట కథలో నీతి చాలా గొప్పది. పొదుపు చేసుకునే మహాయజ్ఞంలో ఈ కథ మచ్చుతునకగా నిలిచిపోతుంది. పొదుపు చేసుకోడం మంచిదే కావచ్చు. దాని కోసం పరుగుల్తీయడం మాత్రం మెచ్చుకోతగ్గపని కాదు. వదిలేయండి. ఆ ఇంటికి పెళ్ళి చూపుల కోసం ఒక కుర్రాడొచ్చేడు. ఆ కుర్రాడు తమ వంశాచారానికి సూటవుతాడో లేదో తెలుసుకోవాలని గంగాళం లాటి బక్కెట్లో నీళ్ళు పోసి కాళ్ళు కడుక్కోమని పెళ్ళి కొడుక్కి చెప్పేరుట! సదరు పెళ్ళి కొడుకు బక్కెట్లో వున్న నీరంతా కాళ్లమీద పోసుకుని తుడుచుకోవడానికి టవలడిగేట్ట! చిన్నాయన చిరాగ్గా టవలిచ్చేట్ట. మా ఇంటి అల్లుడయ్యే అదృష్టం నీకు లేదని - వచ్చిన ఆటోలోనే వెళ్ళిపొమ్మని పెద్దాయన చెప్పేట్ట! పిల్లని చూపించకుండానే ఎందుకు వెళ్ళిపొమ్మంటున్నారో అర్థం గాక పెళ్ళికొడుకు బిక్కమొహం పెట్టినప్పుడు అసలు పాయింటు పెద్దాయనే చెప్పేట్ట. గంగాళం నీళ్ళు నీ పాద ప్రక్షాళనకే ఖర్చు చేసిన నువ్వు - రేపు నీ పెళ్లయింతర్వాత నీకొచ్చే జీతం రాళ్లల్లో ఏమి మిగుల్చుకోగలవు? మా పిల్లని ఏం సుఖపెట్టగలవు? డబ్బయినా నీళ్లయినా, పొదుపుగా వాడుకునే వాడే మాకు అల్లుడిగా సూటవుతాడని పొదుపు సూత్రం చెప్పి పెళ్ళికొడుకుని పంపించేసేడుట!

ఈ దిక్కుమాలిన రోజుల్లో రేపటి కోసం కొంచెమో గొప్పో వెనకేసుకోడం మంచి పద్ధతే! ఈ మాటనే జాతీయ పొదుపు సంస్థలు కూడా జాతికి తరచూ గుర్తు చేస్తున్నాయి. బాగు పడమని హెచ్చరిస్తున్నాయి. అంతేగాని - కడుపు మాడ్చుకుని కూడబెట్టండని చెప్పడం లేదు. అట్లా చేస్తే - అది క్లాస్‌వన్ పిసినారితనానికి నెంబర్ వన్ నమూనా అవుతుంది! పొదుపరితనానికీ, పిసినిగొట్టు వ్యవహారానికీ మధ్య చిన్న గీత ఒకటుంది. ఆ గీత దాటితే అది ఇదవుతుంది! ఆ మాటకొస్తే - పిసినిగొట్టు వ్యవహారాల్లో మగమారాజులే ముందుంటారు. ఈ టైపు కథలు కోకొల్లలున్నాయి. కొన్ని సినీమాలుగా కూడా వచ్చేయి. మరికొన్ని నవలలుగా ప్రసిద్ధి చెందేయి. రాసిన వారంతా మగ రచయితలే! స్వానుభవాలు. గదా-ఆ రచనలకు పవరెక్కువ. తరతరాలుగా చెక్కు చెదరకుండా తమ విలువను కాపాడుకుంటాయి!

ఖరీదైన నాన్ వెజిటేరియన్ తిండి తినాలనుకుంటాడు. అంటే ఖర్చెక్కువవుతుందని బెంగపడతాడు. ఈలోగా ఎవరో ఏదో సందర్భంగా డిన్నరుకు పిలుస్తారు. ఆ కార్డులో నాన్‌వెజిటేరియన్ తిండి కూడా కలదని ప్రత్యేకంగా రాస్తారు! కార్డందుకుని - ఎల్లుండి తినబోయే పుడ్డుకోసం నేటి నుంచే కలలు కంటాడు. ఆ రెండు రోజులూ భోం చేయకుండా కడుపు మాడ్చుకుంటాడు. ఈ విధంగా బోలెడు ఆదా అయ్యిందని ఆనందిస్తారు. డిన్నరు నాడు మాత్రం విజృంభిస్తాడు! ఎవరికి వారే వడ్డించుకు తినే పద్ధతికి కట్టుబడి - జనాన్ని తోసేసుకుంటో మాంసాహారమ్మీద విరుచుకుపడతాడు. కడుపు నిండా భోంచేసి కిళ్ళీ నముల్తూ చికెన్‌లో మషాలా కొంచెం ఎక్కువైందని వంకపెడతాడు. ఏ వంకా పెట్టకపోతే కొత్తగా తింటున్నాడని ఎవరైనా కామెంటు చేస్తారేమోనన్న భయంతో చిన్న విసురు విసుర్తాడంతే! ప్రతి రోజూ అతను కోడి కూర ముట్టందే ముద్ద దిగదనే టైపులో ఆ పార్టీలో ప్రవర్తించడం కూడా అతని ప్రత్యేకత!

పిల్లలు అడుగుతున్నారని ఇంటో చేపల పులుసు చేస్తే ఇంటావిడ మీద విరుచుకుపడతాడు. ఆరోగ్యానికి సొంత ఇంటో చేపల పులుసు ఏ మాత్రం మంచిది కాదని తప్పుడు సూత్రాలు చెబుతాడు. ఆకుకూరలు, దుంపకూరల్లో మాత్రమే మంచి మంచి విటమిన్లున్నాయని పాఠం చెబుతాడు. అవి కూడా మితంగా మింగాలంటాడు! నాన్‌వెజిటేరియన్ కూరలకు పిల్లలు మొహం వాచి వున్నారని ఇల్లాలు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తుంది. వెంటనే అతడు ముష్టి థియరీ ఒకటి మనవి చేస్తాడు. కోడికూర తినాలనుకున్నప్పుడు - కంచమ్ముందు కోడిని కట్టేసుకుని ఆ కోడిని చూస్తూ కంచంలో పచ్చడి మెతుకులు నముల్తుంటే - కోడిని తిన్న ఫీలింగు ఈజీగా కలుగుతుందని పరమ చవకబారు ఫీటు చెబ్తాడు. అంచేత సొంత ఇంటో చికెన్, మటన్ లాటి నీచు పదార్థాలు మచ్చుకైనా కనపడకూడదని బోర్డుకడతాడు!

హాయిగా బతకాలనుకున్న వాడు - మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్ - మీ ఇంటికి వస్తే మాకేం పెడతావనే నినాదం మరిచిపోకూడదని మరీమరీ చెబ్తాడు ! తన ఇంటికి రాకరాక వచ్చిన బంధువును గుమ్మం దగ్గరే నిలబెట్టి - వాలకం చూస్తుంటే దార్లోనే భోం చేసినట్టున్నారు గనక - మా ఇంటో కనీసం మంచినీళ్ళయినా పుచ్చుకు వెళ్ళండని బాణం వేస్తాడు! ఆ బంధువు మంచినీళ్ళు తాగి బిక్కమొహంతో వెళ్ళిపోతుంటే - గుడ్లవల్లేరులో అరగంట బస్సాగుతుందని గుర్తు చేస్తాడు. అక్కడ మిలట్రీ హోటల్లో నా పేరు చెప్పి భోం చేయండని సలహా ఇస్తాడు. మీరు ఆ హోటల్లో భోం చేయకపోతే నామీద ఒట్టే అని రాగాలు తీస్తాడు. ఇంత ఆగడం చూస్తున్న ఇల్లాలు కన్నీరెట్టుకుంటుందేగాని - భర్త మీద కత్తి దూయలేదు గదా! ఆ శక్తి ఆవిడకు లేదనే ధీమాతో విర్రవీగుతుంటాడు మైజరాఫిండియా! బోలెడు కట్నం పోసి అతడ్ని కొనుక్కున్న ఇల్లాలు ఇల్లాంటి విన్యాసాలు చాలా చాలా చూడాలి మరి! ◆



ఒకే రాతిలో చెక్కిన గుహాలయాలు

అందాల సీమ 'భైరవకోన'

గలగల మంటూ సవ్వడి చేసే ఎత్తయిన జలపాతం, నింగిని తాకుతున్నాయా అన్పించే వృక్షాలు, సుందర ప్రకృతి. పక్షుల కిలకిలారావాలు ఆహ్లాద భరిత వాతావరణం. శోభాయమానంగా విరాజిల్లే శిల్పారామాలు దాని సొంతం. అదే 'భైరవకోన'.

అందాల నిలయమైన ఈ కోన ప్రకాశం జిల్లాలో ఉంది. చంద్రశేఖరపురం (సివిఎస్‌పురం) మండలం అంబవరం పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోన పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణ. రమణీయ దృశ్యాలను తనలో ఇముడ్చుకున్న ఈ ప్రాంతం నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో తూర్పు కనుమల మధ్య ఉంది. దేశంలో ఉన్న క్షేత్రాల్లో అరుదైన చరిత్రను భైరవకోన సొంతం చేసుకుంది. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలిసి ఉండే ఏకైక క్షేత్రం ఇదే. ఎక్కడ చూసినా కోనేరులు, శివలింగాలు ఈ కోనలో కనిపిస్తాయి. ఎనిమిది దేవాలయాల క్షేత్రం ఇది.ఎనిమిది దేవాలయాలనూ ఒకే రాతిలో చెక్కటం విశేషం.ఎనిమిది రూపాలతో శివుని ఈ క్షేత్రాల్లో దర్శించవచ్చు. శశినాగ, రుద్ర, విశ్వేశ్వర, నగరికేశ్వర, బర్గేశ్వర, రామేశ్వర, మల్లికార్జున, పక్షఘాతక లింగాల రూపంలో హరుని దర్శించుకోవచ్చు. బర్గేశ్వర ఆలయంలో త్రిముఖ దుర్గాంబ విగ్రహాన్ని రాతితో మలిచారు. ఈ ఆలయం కాళభైరవుని విగ్రహాన్ని అద్భుతంగా చెక్కారు. కోనలో ఏకశిల ఆలయాలు, వాటిలో మలిచిన విగ్రహాలు పర్యాటకులను అబ్బురపరుస్తాయి. శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా అవి నిలిచాయి. ఏకశిలతో నిర్మించిన మొదటి నాలుగు ఆలయాలనూ చతురస్రాకార గర్భాలయంగా మలిచారు. మిగిలిన నాలుగు గృహాలయాల ముందు రెండు స్తంభాలతో కూడిన ముఖమండపం ఉంటుంది. గర్భగుడులలో ప్రవేశద్వారాలకు ద్వారపాలకులు, వారికి ఇరువైపులా బ్రహ్మ, విష్ణువు విగ్రహాలను నిర్మించారు. ఆలయాలన్నిటి ముందు నంది విగ్రహాలను చెక్కారు. క్రీస్తు శకం ఏడు, ఎనిమిది శతాబ్దాలకు చెందిన శిల్పకళా శైలితో ఆలయాలను నిర్మించారని పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. దుర్గాదేవి ఆలయానికి మూడు అడుగుల దిగువన ఏడాది పొడవునా ప్రవహించే సెలయేరు ఉంది.

ఈ క్షేత్రాన్ని కాళభైరవుడు పరిపాలించే వాడని అందుకే దానికి భైరవకోన అని పేరు వచ్చిందంటారు. కోన ఉన్న కొండ దక్షిణాన నెల్లూరు జిల్లా ఉదయగిరికి 30 కిలోమీటర్ల వరకూ విస్తరించి ఉంది. ఉత్తరాన సివిఎస్‌పురం మండలం బి. చెన్నంపల్లి వరకూ 15 కిలోమీటర్ల పరిధిలో కొండ నెలకొని ఉంది. తూర్పున నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం పెదరెడ్డి పల్లి వరకూ 20 కిలోమీటర్లు విస్తరించి ఉంది. పశ్చిమాన సివిఎస్‌పురం మండలం అంబవరం కొత్తపల్లికి ఐదు కిలోమీటర్ల దూరం వరకూ కొండ విస్తరించి ఉంది. ఈ క్షేత్రానికి ఉత్తరంగా రాజుల కోట నిర్మించారు. కొండ చుట్టూ 10 కిలోమీటర్ల వరకూ కోటగోడ నిర్మించి ఉంది. కోనకు వచ్చే పర్యాటకులకు బంగారు రంగుతో 'పోకపోతుచెల' పర్వత ప్రాంతం స్వాగతం పలుకుతుంది. మేకపోతుకు వస్తువులను కట్టి ఇక్కడికి చేర వేసేవారని పూర్వీకులు చెప్పేవారు.అందుకే



శిల్ప సంపదకు నిలయాలు భైరవకోన గుహాలయాలు

ఆ పేరును ఈ కొండకు పెట్టారంటారు. దీనికి ఎదురుగా ఉండే 'నారపేటు చెల' నుంచి కోనలోకి అడుగుపెట్టాలి. హాలీవుడ్ చిత్రం 'మెకన్నాస్‌గోల్డ్' దృశ్యాలను ఇక్కడి వాతావరణం గుర్తు చేస్తుంది. సూర్యోదయం వేళ ఇక్కడ బంగారు గనులు ఉన్నట్టు కొండ నుంచి వచ్చే మెరుపులు భ్రమింప చేస్తాయి. అరేబియన్ నైట్స్ ఊహ కన్నా ఆహ్లాదంగా పర్యాటకులకు అందమైన అనుభూతి ఇక్కడ మిగులుతుంది. సుమారు ఐదొందల సంవత్సరాల నాటి మర్రిమానులు అక్కడ విస్తరించి ఉంటాయి. 101 దొనలు, నీటి కొలనులు కొండపై ఉన్నాయని చెబుతారు. కొండపై కోటగోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడకు రంధ్రాలు పడ్డాయి.కోటపై జండాలు ఉంచే ప్రదేశాన్ని 'జండాబోడు' అంటారు. రాజుల ప్రాకారంలో రహస్య సొరంగ మార్గం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో దాన్ని ఉపయోగించుకునే వారట. శత్రువుల కంటపడకుండా ఉన్న ఈ దారి 'అనుమనగిరి'కి చేరుతుందట. దీన్నే చరిత్ర కారులు 'కానందానికంత'గా వ్యవహరించారు. కొండకు దక్షిణం వైపున ఉండే శిఖరంపై పంచలింగాల ఘట్టం ఉంది. ఇక్కడ పరశురాముడు యజ్ఞం చేశాడని భక్తుల నమ్మిక.

ఛోటా నయాగరా

కొండపై నుండి సుమారు 200 మీటర్ల ఎత్తు నుండి 'జలపాతం' కిందికి జారుతుంది. ఇది ఏడాది పొడవున ప్రవహిస్తుంది. కొండపై ఉన్న లింగాల పెంట సమీపంలో మైలకొలను నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరందాకా నీరు ప్రవహించి లక్ష్మి, సరస్వతి, పార్వతి కొలనులకు చేరతాయి. అక్కడ నుంచి త్రివేణి సంగమం, చిత్రకూటమి సరస్సులకు చేరుతుంది. ఈ సరస్సుల నుంచే జలపాతం ప్రవహిస్తోంది. దీన్నే 'సోనవాన'గా పిలుస్తారు. జలపాతం నుంచి కిందకు జారిన నీరు దుర్గాంబ, భైరవాలయాల మీదుగా ప్రవహిస్తుంది. జలపాతం చేసే సవ్వడి పర్యాటకులను ఏ మాత్రం కదలనీయక మంత్రముగ్ధులను చేస్తుంది. కార్తీక పౌర్ణమి రోజు చంద్రుని కాంతి కిరణాలు సెలయేటి నీటి మీద పడి ప్రతిఛాయ 'దుర్గాదేవి'పై ప్రసరిస్తుందట. ఈ దృశ్యాన్ని చూసేందుకు కోనకు వేలాది మంది వస్తుంటారు. జలపాతంలోని నీటిలో ఖనిజలవణాలు ఉంటాయంటారు. ఇక్కడ నీరు తాగినా, స్నానం చేసినా చర్మసంబంధ వ్యాధులు తగ్గుతాయట. ఈ నీరే దీర్ఘకాలిక రోగాలనూ నివారిస్తుందని విశ్వసిస్తారు. కార్తీక మాసం, మహాశివరాత్రికి ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. పర్వదినాల్లో వేలాది మంది భక్తులు ఇక్కడికి వస్తారు. వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఇక్కడ సేద తీరవచ్చు. అతిశీతల వాతావరణం ఇక్కడ ఏర్పడుతుంది. అజంతా గుహలను ఇది తలపింపజేస్తుంది. పల్లవ, చోళులు ఈ క్షేత్రాన్ని నిర్మించారని పురాతత్వ శాస్త్ర వేత్తలు ధృవీకరించారు. పర్యాటకుల కోసం శని, ఆదివారాల్లో ఒంగోలు నుంచి భైరవకోనకు ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయి. సివిఎస్‌పురం నుంచి సీతారామపురం బస్సు రూటులో అంబవరం కొత్తపల్లి దిగాలి. అక్కడ నుంచి ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ దారిని తారురోడ్డుతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. టూరిజం ప్యాకేజీ ప్రకారం స్నానఘట్టాలు నిర్మాణం జరుగుతున్నాయి. చరిత్రఘట్టాలు చూడాలంటే 'అనంతరాజు బావి' నుంచి నడిచి కొండపైకి వెళ్లాలి. ఇక్కడ కూడా ఘాట్‌రోడ్డు నిర్మించాలన్న కోరిక కలగా మిగిలే ఉంది. పర్యాటకులు బస చేయడానికి కాటేజీలు లేకపోవటం కోన అభివృద్ధికి ప్రధాన ఆటంకం. ◆

క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ లెఫ్ట్‌ఆర్మ్ బౌలర్, క్రికెట్ జెంటిల్మన్‌ను ఇక క్రికెట్ మైదానంలో చూసే అవకాశాన్ని అభిమానులు కోల్పోయారు. ఫాస్ట్ బౌలింగ్‌లో ఒక శకానికి తెరపడింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 19 ఏళ్ల సుదీర్ఘ యాత్రకు అక్రం వారం రోజుల క్రితం ఫుల్‌స్టాప్ పెట్టాడు. దీంతో క్రికెట్ ప్రపంచంలో ఒక ఉద్దండ బౌలర్ తెరమరుగయ్యాడు. తాను ఎదుర్కొన్న ఉత్తమ బౌలర్లలో ఐదుగురి పేర్లను చెప్పమని ఏ అంతర్జాతీయ బ్యాట్స్‌మన్‌ను అడిగినా అతను తన లిస్టులో అక్రం పేరును తప్పకుండా చేర్చుకుంటాడు. ప్రపంచ ఉత్తమ బౌలర్లలో అక్రం ఒకడు అని చెప్పడానికి ఇదే నిదర్శనం.

*** ఇంజమామ్-ఉల్-షరీఫ్**

అల్‌విదా అక్రం భాయ్

దాదాపు వేయి మంది అంతర్జాతీయ బ్యాట్స్‌మెన్‌ను అవుట్ చేసిన (502 వన్డే వికెట్లు, 414 టెస్ట్ వికెట్లు) ఘనతను దక్కించుకోవడం అతనికే చెల్లింది. ఐదు ప్రపంచకప్‌లలో పాల్గొనగలగడం అతని అసమాన ఫిట్‌నెస్‌కు నిదర్శనం.

14 ఏళ్లలో ఏడుసార్లు మాత్రమే ఎదురుపడ్డ అక్రం, సచిన్

వసీం అక్రం రిటైర్మెంట్ ప్రకటన ప్రపంచ క్రికెట్ అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రపంచ ఉత్తమ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్, ప్రపంచ ఉత్తమ ఫాస్ట్ బౌలర్ అక్రంల పోరాటాన్ని మైదానంలో తిలకించే అదృష్టం ఇకనుండి అభిమానులకు దక్కకపోవడం బాధకలిగించే విషయం. ఈ ఇద్దరు క్రికెట్ ప్రముఖులు ప్రత్యర్థి సామర్థ్యం పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిస్తారు. భారత్-పాకిస్తాన్‌ల మధ్య క్రికెట్ సంబంధాలు దెబ్బతినడంతో మైదానంలో ఇరువురి పోరాటాన్ని తిలకించే అదృష్టానికి అభిమానులు నోచుకోలేకపోయారు. వీరు జట్టులో ఉన్నప్పుడు రెండు దేశాల మధ్య రెండు సిరీస్‌లు మాత్రమే జరిగాయి. ఆసియా టెస్ట్ ఛాంపియన్ షిప్ సందర్భంగా ఒక టెస్ట్ మ్యాచ్‌లో కూడా ఇరువురూ పోటీపడ్డారు. సచిన్ తొలి టెస్ట్‌ను 1989-90లో పాకిస్తాన్‌పైనే ఆడాడు. ఆ సిరీస్ తర్వాత ఇరు దేశాల మధ్య మరో సిరీస్ కోసం తొమ్మిది సంవత్సరాలు వేచి ఉండాల్సి వచ్చింది. అక్రం నేతృత్వంలోని పాక్ జట్టు భారత్‌లో రెండు టెస్ట్‌ల చిరస్మరణీయ సిరీస్‌లో పాల్గొన్నది. తర్వాత ఆసియా టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా కొల్‌కతాలో ఒక టెస్ట్‌మ్యాచ్ నిర్వహించారు. దీంతో గత 14 సంవత్సరాల్లో సచిన్, అక్రంలకు ఏడు టెస్ట్‌మ్యాచ్‌లలో మాత్రమే ముఖాముఖి ఎదురుపడే అవకాశం దక్కింది. భారత్-పాక్‌ల మధ్య సంబంధాలు సరిగ్గా ఉంటే ఇరువురూ కనీసం 25-30 టెస్టుల్లో ముఖాముఖి తలపడేవారు. ఈ ఉత్తమ ఆటగాళ్ల సామర్థ్యాన్ని క్రికెట్ అభిమానులు నేరుగా తిలకించకుండా ఎంత నష్టపోయారో! దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన ప్రపంచకప్ సందర్భంగా సచిన్, అక్రంలు తలపడ్డారు. ఇరువురూ తమ హుందాతనాన్ని, నిగ్రహాన్ని కోల్పోకుండా వ్యవహరించి ఆదర్శ ఆటగాళ్లుగా నిలిచారు. ప్రపంచకప్ లీగ్ దశలో భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాక్ ఫాస్ట్ బౌలింగ్ సంచలనం షోయబ్ అక్తర్ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌ను అవుట్ చేయడంపై అవాకులు చెవాకులు పేలాడు. కానీ వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసుకున్న అక్రం మాత్రం నోరుజారకుండా జాగ్రత వహించి తన ప్రతిష్టను కాపాడుకున్నాడు. చిన్న రన్నప్ కలిగిన అక్రం భుజాన్ని తిప్పే తీరు అద్వితీయం. అతని చేతిలోంచి వెలువడే నిప్పులు చెరిగే బంతిని చూసి భయపడని బ్యాట్స్‌మన్ లేడంటే అతిశయోక్తి కాదు. బంతిని పిచ్‌పై అనుకున్న చోట టప్ వేయగలగడంలో అతను దిట్ట. బంతిని స్వింగ్ చేయడంలో, కట్ చేయడంలో అతనికి అతనే సాటి. లెఫ్ట్‌ఆర్మ్ బౌలింగ్ ఎలా వేయాలో క్రికెట్ ప్రపంచానికి నేర్పిన వ్యక్తి అక్రం. దురదృష్టవశాత్తు అతన్ని డయాబెటిస్ వ్యాధి పీడిస్తోంది. అయినా మందులను నిరంతరంగా వాడుతూ క్రికెట్‌కు అవరోధం కలగకుండా జాగ్రత వహించిన అక్రం నిజమైన అథ్లెట్‌కు మారుపేరు.

మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు

రెండు దశాబ్దాల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో అతను గడ్డు పరిస్థితిని కూడా ఎదుర్కొన్నాడు. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలను ఎదుర్కొన్న అక్రంకు కెప్టెన్ పదవి మళ్లీ ఇవ్వకూడదని ఫిక్సింగ్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఖయ్యాం కమిషన్ పాక్ క్రికెట్ బోర్డుకు సిఫార్సు చేసింది. జావేద్ మియాందాద్, వకార్ యూనిస్‌లతో అతనికి విభేదాలు ఉన్నాయని ఆరోపణలు కూడా వచ్చాయి. బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డాడని ఇంగ్లండ్ ఆటగాళ్లు అతనిపై ఐసిసికి ఫిర్యాదు చేశారు. అతను మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడా? వకార్, మియాందాద్‌లతో ఘర్షణకు ఇతన్నే తప్పుపట్టాలా? రివర్స్ స్వింగ్ కోసం అతను బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డాడా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభించవు. అయితే ఉత్తమ బౌలర్లలో ఇతను ఒకడు అనే విషయం మాత్రం సుస్పష్టం! అంతేకాదు లెఫ్ట్-ఆర్మ్ బౌలర్లలో ఇతనికి మరెవరూ సాటిరారు!! ◆

బయోగ్రఫీ

జననం : జూన్ 3, 1966.
బ్యాటింగ్ : ఎడమచేతి బ్యాటింగ్.
బౌలింగ్ : లెఫ్ట్-ఆర్మ్ ఫాస్ట్ బౌలర్.
కుటుంబం : భార్య, ఇద్దరు పిల్లలు
ప్రత్యేకతలు :
ఎ) అత్యధిక వన్డే మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్.
బి) ఆల్‌టైమ్ బెస్ట్ వన్డే బౌలర్‌గా విస్డెన్ నుండి గుర్తింపు.
సి) ప్రపంచంలోనే అత్యుత్తమ రివర్స్ స్వింగ్ బౌలర్.
డి) వకార్ యూనిస్‌తో కలిసి చాలా సంవత్సరాలు పాకిస్తాన్ జట్టుకు ఓపెనర్ బౌలర్‌గా సేవలందించాడు.
వన్డేల్లో ఆరంగేట్రం : 1984 నవంబర్‌లో ఫైసలాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో.
ఆడిన వన్డే మ్యాచ్‌లు : 356.
తీసుకున్న వికెట్లు : 502 వికెట్లు
చేసిన పరుగులు : 3,717 పరుగులు
ఆడిన టెస్టులు : 104.
తీసుకున్న వికెట్లు : 414 వికెట్లు
చేసిన పరుగులు : 2,898 పరుగులు
కెరీర్‌పై మచ్చ : ఎ) మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు.
బి) ఫిక్సింగ్‌పై విచారణ జరిపిన కమిషన్‌కు సహకరించలేదనే ఆరోపణలపై 2000లో జరిమానా విధించారు.
సి) కెప్టెన్సీ నుండి కూడా తొలగించారు.
కెరీర్‌లో ఉత్తమ ఘట్టాలు : ఎ) ఇంగ్లండ్‌తో జరిగిన 1992 ప్రపంచకప్ ఫైనల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది.
బి) 1999 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైన పాక్ జట్టుకు నేతృత్వం వహించాడు.
సి) దక్షిణాఫ్రికాలో (2003లో) ఐదవ ప్రపంచకప్‌లో పాల్గొన్నాడు.
డి) ఇంగ్లీష్ కౌంటీ మ్యాచ్‌లలో లాన్సషైర్‌కు దశాబ్దంపైగా ప్రాతినిధ్యం.
ఇ) వన్డేల్లో 500 వికెట్లు తీసుకున్న ఏకైక బౌలర్ (2003 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్ బ్యాట్స్‌మన్ నిక్ స్టాథమ్‌ను అవుట్ చేయడం ద్వారా).

కొడుకులు

* బింగి సత్యనారాయణ



గత దినమే భార్య కర్మకాండ ముగించి ఆమె ఫొటోకెదురుగా వాలు కుర్చీలో శోకమూర్తిలా కూర్చున్నాడు రఘురామయ్య. ఒంటరిగా కూర్చున్న తనను ఏవో జ్ఞాపకాల దొంతరలు హృదాయాన్ని కన్నీటి మయం చేస్తున్నాయి. ఓసారి చుట్టూతా చూశాడు. అనుక్షణం అద్దంలా కాపాడుకునే తన యజమానురాలు లేదని కాబోలు ఇల్లు బావురుమన్నట్టుగా తోచింది. బాధ కలిగితే అమ్మా అనే లోపే తలనిమిరి ఓదార్చే తోడులేని ఇంటిని చూస్తే తనకి గుండె జారిపోతోంది. నలభై అయిదేళ్ళ దాంపత్య జీవితాన్ని తెంచుకుని తనని మాత్రం ఒంటరిని చేసి తన దారిన తాను వెళ్ళిపోయిందని కాబోలు, కళ్ళతోనే దీనంగా ప్రశ్నిస్తున్నట్టుగా ఆమె చిత్రాన్నే చూపు మరల్చకుండా చూడసాగాడు. బాధల్లో, కష్టాల్లో ఉన్నప్పుడు పాలుపంచుకొని కళ్ళు తుడిచి ఓదార్పునిచ్చేది. మానసిక దౌర్భల్యం చెందినప్పుడు, వెన్నుతట్టి ధైర్యాన్నిచ్చే తన భార్య జానకిని తలచుకొంటే హృదయం విలవిల్లాడింది.

నలభై అయిదేళ్ళు పాలలో నీళ్ళలా కలిసిపోయిన అన్యోన్య దాంపత్యం వారిది. ఇన్ని నాళ్ళ సహజీవన పయనంలో భర్త మాటకు ఏనాడూ ఎదురు చెప్పింది లేదు. అలాగని భార్యనతను అదుపాజ్ఞలో పెట్టిందీ లేదూ. జానకి ఏనాడూ ఓ కోరికా కోరలేదు. తన నుండి ఏదీ ఆశించలేదు. కాని ఈ మధ్యకాలంలో ఒకే ఒక్క కోరిక కోరింది. తనని పక్షం రోజుల కిందట తీర్థయాత్రలు చూడాలని ఏనాడూ నోరు తెరచి అడగని భార్య జీవితంలో ఒకేఒకసారి కోరటంతో అడిగిందే తడవుగా ఒప్పేసుకొని ట్రెయిన్ టికెట్స్ రిజర్వేషన్ చేయించి తెచ్చాడు. కాని వాటితో పని లేకుండా పోయింది. తను నేడు బతికుంటే ఆ టికెట్స్‌తో షిరిడీకి పయనమయ్యే వారు. కానీ ఈలోపే గుండెపోటు వచ్చి ఆమెను ఏకంగా ఈ లోకం నుంచే తీసుకుపోయింది. ఇంతలో బయటి నుండి ముగ్గురు నడి వయస్కులు ఇంట్లోకి వచ్చారు. వారి రాకను గమనించిన రఘురామయ్య ఇద్దరు కుమారులు విశ్వం, విభీషణ్. వారి వారి గదుల నుండి పరుగున వచ్చి నవ్వు చిందిస్తూ స్వాగతం పలికారు. వచ్చిన వారు సోఫాలో ఆసీనులైనారు. వీరి రాకను గమనించని రఘురామయ్య ఏమీ పట్టనట్టుగా వున్నారు. విశ్వం, విభీషణ్ వచ్చిన పెద్దలకు తండ్రి వైపు చూపి మందలించమన్నట్టుగా సైగ చేశారు. అందులో ఒకరు గొంతు సవరించుకుని "నమస్కారం మాష్టారుగారూ!" అన్నాడు వినమ్రంగా. మెల్లిగా వారి వైపు తల తిప్పి నిర్లిప్తంగా ఓ చూపు చూశారు. ఎదురుగా కూర్చున్న వారికి నమస్కారం చేసి సూటిగా చూడలేకపోయారు. ఎందుకంటే లావాలా పొంగుతున్న దుఃఖం కట్టలు తెచ్చుకుంటుందేమోననే భయంతో.. "అమ్మగారు..." అర్థోక్తిగా ఆపేశాడు మరో అతను.

భార్య ప్రసక్తిరాగానే రఘురామయ్య గుండెలో దుఃఖం సుడులు తిరిగి కళ్ళలో కన్నీళ్ళు చేరాయి. వణుకుతున్న పెదాల్ని బిగబట్టాడు తలపక్కకు తిప్పుకొని గుడ్ల నీరుకుక్కుకోవడం చూసి వారి హృదయం చలించిపోయి మిన్నకుండిపోయారు. గదుల్లో ఉన్న ఇద్దరు కోడళ్లు మెల్లిగా బైటికొచ్చి గుమ్మం దగ్గర చెరోవైపు చేరగిలపడి మౌనంగా నిల్చున్నారు. కాసేపటికి ఏదో విషయం అడగమన్నట్టుగా సైగ చేశారు. భర్తలకు ఆ సైగ వీరి నుండి వచ్చిన పెద్దల మీదికి మరలింది. "పుట్టిన వారు ఎవరైనా ఎప్పుడోఅప్పుడు పోవాల్సిందే! ఈలోకంలో ఎవరు శాశ్వతం కాదు. అయినా మీకు చెప్పేంతటి వారమా! అన్నీ తెలిసిన మీరే ఇలా అయితే, మరి.... పిల్లలు...."

ఏదో చెప్పాలనుకున్నాడు రఘురామయ్య. కాని గొంతుకు దుఃఖం అడ్డుపడటంతో మాటపైకి పెగలక ముఖం దించుకున్నాడు. వచ్చిన వారు ఓ మారు ఒకరి మొఖాలు ఒకరు చూసుకొన్నారు. ముఖ్యంగా చెప్పాలని వచ్చిన విషయాన్ని ఎలా మొదలు పెట్టాలా అని తటపటాయించారు. అందులో ఒకతను ధైర్యం చేసి,

"మాష్టారుగారూ..!" ఏమిటన్నట్లుగా పైకి చూశాడు రఘురామయ్య.

"అది... మీకొడుకిలిద్దరూ మా దగ్గరకొచ్చి ఓ విషయాన్ని చెప్పారు. అది మీకు తెలిసిన విషయమే అనుకోండి. అదే... ఈ ఊళ్ళో ఇల్లు, పొలం అమ్మేస్తే... మిమ్మల్ని వారితోపాటే సిటీకి తీసుకెళతారట."

ఆస్తులు, అమ్మకాలు అనేసరికి తలెత్తి కొడుకులిద్దరివైపు సూటిగా చూశాడు. వారు దభాల్న తలలు దించుకున్నారు. వణుకుతున్న పెదాల్తో రఘురామయ్య, "మీకెన్నిసార్లు చెప్పాలి!? నేను నా ప్రాణం పోయినా వాటిని అమ్మే ప్రసక్తే లేదు. కొద్దిసేపటికి తనలో తానే తమాయించుకొని, "చూడండి! ఎలాగూ

తదనంతరం వీరికేగా ఈ ఆస్తి మొత్తం. అప్పుడు అమ్ముకొని తీసుకోమనండి. కాని నేను బ్రతికుండగా అమ్మలేను. ఎన్నో ఏళ్ళ అనుబంధం ఉన్న ఈ ఊరు, ఈగాలి. ఈ నేలను విడిచి ఎక్కడికీ వెళ్ళలేను. ఇక్కడి నా ఆస్తులు అమ్మి ఎక్కడా ఉండలేను. ఇక్కడే పుట్టాను ఇక్కడే హాయిగా కన్ను మూయాలి" అన్నాడు ఉద్వేగభరితంగా.

పెద్దకొడుకు విశ్వం మెల్లగా. "అది... కాదు... నాన్నా! అమ్మాయికి మంచి సంబంధం వచ్చింది. అబ్బాయి ఫారిన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. మన అమ్మాయి చదువు సంస్కారం, మన కుటుంబ గౌరవ మర్యాదలు తెలిసి వచ్చారు. మన అమ్మాయి వారికి బాగా నచ్చింది. మనం వారికి తగిన హోదాలో కట్నం ఇచ్చుకుంటే తాంబూలాలు మార్చుకుందామన్నారు. అందుకని... [illegible] కట్నకానుకలు ఇవ్వాలంటే లక్షల్లో పని. అందుకని నాకు రావాల్సిన నా వాటా నాకిచ్చేస్తే... అమ్మాయి పెళ్ళి ఘనంగా జరిపిద్దామనుకొంటున్నాను. ఆలస్యం చేస్తే వారు వేరొక సంబంధం వెతుక్కునే అవకాశం ఉంది. అందుకని...." అన్నాడు. అన్నగారు అలా చెప్పాడో లేదో ఇదే అదననుకొని విభీషణ్ తను చెప్పడం మొదలు పెట్టాడు. "నాన్నా! నిజం చెప్పాలంటే నా పరిస్థితీ అలాంటిదే. ఇప్పటిదాకా అపార్ట్‌మెంట్స్‌లో అద్దెకు ఉండి ఉండి లక్షల కిరాయిలు చెల్లించాను. అందుకని ఆ మధ్యన కొన్న స్థలంలో ఓ బంగ్లా కట్టాలనుకొంటున్నాను. ఇప్పటిదాకా ఆ ఆలోచన లేదు కాని, ఆ సైటున్న ప్రదేశంలో స్థానిక రౌడీ షీటర్స్ ఆధిపత్యం చెలాయిస్తున్నట్లు తెలిసింది. వారి చేతుల్లో అది పడకముందే, త్వరగా ఇంటిని కట్టే కార్యక్రమాలు మొదలు పెడదామనుకుంటున్నాను" అన్నాడు కాస్త బాధగా విభీషణ్. కొడుకుల ఆంతర్యం కొద్దికొద్దిగా అర్థమవసాగింది రఘురామయ్యకు. వీరి సమస్యలు కాని, బాధ్యతలు కాని డబ్బు దగ్గర కేంద్రీకృతమైందని, అది తన స్వార్జితమైన ఆస్తిపైనే అని తెలిసేసరికి చిరాకేసి విసుగొస్తుంది. అంటే... వీరికి నా మీద పూర్తిగా నమ్మకం లేదన్నమాట. నేను ఈ ఆస్తిపాస్తుల్ని ఏ అనాధ శరణాలయాలకో రాస్తానని వారికి ఏ మూలో లేకపోలేదు. అయినా! వారి అవసరాలకు సరిపడ డబ్బుల్లేవా వారి దగ్గర. మంచి ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నారు. జీతం కంటే గీతం పుచ్చుకునే బకాసుర ప్రబుద్ధులు. అయినా డబ్బుమీద ఎవరికి ఆశ ఉండదు. అందుకే కాబోలు ఈ ఊరి పెద్దలకు తమ దీనగోడు ఎంత రమ్యంగా చెప్పి, వారి మనసుల్ని కరగింపచేశారో.. మా బాధల్ని మీరే పరిష్కరించాలని వేడుకొని తీసుకొచ్చి ఉంటారని రఘురామయ్య అనుకున్నాడు. కూర్చున్న చోటునుండి లేచాడు.

"అయ్యా! మీకు చివరగా ఒకే ఒక్కమాట చెప్పదలచుకొన్నాను. ఈ ఇంటిని, మిగతా ఆస్తుల్ని ఇప్పుడు అమ్మాలన్న ఆలోచనలేదు. నాకున్న ఆస్తిమాత్రం వీరిద్దరికీ చెరి సమానమని మాత్రం చెప్పగలరు. ఇక మీరు..." పూర్తిగా చెప్పకుండానే వారికర్థమై లేచి వెళ్ళిపోయారు. తండ్రిమీద పీకలదాకా కోపంతో కొరకొరా చూస్తున్నాను. తమ భార్యలతో కలిసి మరోమారు రౌండ్ టేబుల్ మంతనాల కోసం పెరట్లోకి విసవిస నడిచారు. మెల్లిమెల్లిగా అడుగులేస్తూ తన భార్య ఫొటో దగ్గరకి వెళ్ళి నిలబడ్డాడు. కొడిగట్టి పోతున్న దీపంలో కాసింత చమురు పోసి కళ్ళజోడును మెల్లిగా తీసి 'చూశావా జానకీ! ఈ ఇల్లు అమ్మాలట. అమ్మగా వచ్చిన డబ్బు కావాలట. వారిక్కావలసింది డబ్బు... డబ్బు... డబ్బు... దాని కోసమే అనుక్షణం వారి పాకులాట. అందుకనే పిల్లల్ని నిన్ననే పంపించి ఈ డబ్బు పంపకాలు తేల్చుకుందామని వారి బిజీ లైఫ్‌లోని అమూల్యమైన ఒకరోజును డబ్బుకోసం వినియోగించారు తెలుసా!! అయినా వారికి ఎక్కడున్నా అదే ధ్యాస కదా! అదే నువ్వు బతికున్నప్పుడు నిన్ను చూడాలని ఉందిరా చిన్నాడా! పెద్దాడా! అని ఎన్నిసార్లు ఫోన్ చేసినా టైం లేదు. బిజీ.... బిజీ... ఆరోగ్యంగా ఉన్నప్పుడు రానివారు హాస్పిటల్ కొచ్చారు. వచ్చి మూగబొమ్మల్లా నిలబడ్డారు తప్ప అయ్యో, అమ్మకు ఇలా అయ్యిందని ఒక్క కన్నీటి బొట్టు వదిలారా!? అయినా ఇలాంటి కరుణలేని వాళ్ళకు మనం



ఎలా జన్మనిచ్చాము. జానకి!? వీరు అనారోగ్యం పాలైనప్పుడు ఎంత తల్లడిల్లేదానికి. ఆయుష్షుకోసం ఎన్ని పూజలు చేసేదానివి. ఎన్ని ఉపవాసాలు చేసేదానివి చదువులకోసం, ఉద్యోగాల కోసం ఒంటిమీద నగల్ని పణంగా పెట్టావు. అయినా వీరికి ఏం తక్కువ చేశామే!? అనుక్షణం మనం తిన్నా తినకున్నా వీరి బాగు కోసం ఆరాట పడే వాళ్ళం. ఆ మమకారం ఏమైనా ఉందా!? రెక్కలు విరిగిన ఈ ముసలి పక్షుల్ని ఏనాడైనా పట్టించుకున్నారా? ఎలా బతుకుతున్నారు నాన్నా అని పలకరించారా! కాని వీరికి మాత్రం మనం, మన బాగోగులు అవసరం లేదు. ఆస్తులు మాత్రం అవసరపడతాయి. మనం ఎంతో చెమటోడ్చి కట్టిన ఈ ఇంటిని అమ్ముతానా చెప్పు!? నువ్వు ఎంత అపురూపంగా చూసుకునే దానిని. ఈ ఇంట్లో ఎక్కడ చూసినా ప్రతి అంగుళంలోనూ నువ్వే కనబడుతున్నావు తెలుసా! బాధలో ఉన్నప్పుడు నా ఒడిలో నువ్వునూ నీ ఒడిలో నేను స్వాంతన చెందేందుకు నీడనిచ్చిన ఈ సౌధాన్ని అమ్మాలట. అమ్మి రొక్కం వారి చేతుల్లో పోయాలట. ఈ ఊరి విడిచి వారి వెంట వెళ్ళాలట. అయినా నేను వెళతానా!? వెళ్ళను. నువ్వు అనుక్షణం తిరుగాడుతూ కనిపించే ఇంటిని వదిలి వెళ్ళను జానకీ! జానకీ....! నువ్వెక్కడ ఉన్నా, ఇక్కడ... ఈ గుండెల్లోనే ఉన్నావు. ఎప్పటికీ ఉంటావు. నీ జ్ఞాపకాలు అంటిపెట్టుకున్నంత కాలం, నిన్ను నేను కలిసేంత కాలం నా దగ్గర ఉంటావు. ఉంటా..వు జా...నకీ" అన్నాడు కండువాతో కళ్ళు అద్దుకుంటూ గద్గద స్వరంతో.

* * *

ట్రింగ్... ట్రింగ్...

టీవీలో ప్రైవేట్ ఛానెల్ చూస్తున్న పెద్దకోడలు సౌండ్‌ని మ్యూట్ చేసింది. విశ్వం ఇంత పొద్దునే ఎవరిదబ్బా అనుకుంటూ రిసీవర్ అందుకున్నాడు. "హలో! ఆఁ ఇది రఘురామయ్యగారిల్లేనా? ఔను. ఆయన కొడుకునే వాట్!" తర్వాత నోటమాట రాలేదు. నిర్లిప్తతంగా ఫోన్ పెట్టేసి పక్కనే ఉన్న సోఫాలో జారగిల పడ్డాడు. వివర్ణమైన భర్త మోము చూసి, "ఎక్కడ్నుండి ఫోన్! చెప్పండి!!" రెండుసార్లు అడిగింది. తమ్ముడు, మరదలు ఆదుర్దాగా గదిలోంచి బయటకొచ్చి, "ఏమైందన్నయ్యా! ఎక్కడ్నుంచి ఫోన్!" అడిగాడు ఆతృతగా.

"నాన్న...! తెల్లవారురఘామున మహారాష్ట్రలోని కళ్యాణ్ దగ్గర జరిగిన రైలు యాక్సిడెంట్‌లో చనిపోయారట" అందరూ ఒక్కసారి అవాక్కయ్యారు. కాసేపటికి విభీషణ్ "ఆయనే నాన్నని ఎలా తెలుసు!?" అడిగాడు. ఆయన జేబులో దొరికిన టెలిఫోన్‌డైరీలో అడ్రస్, టెలిఫోన్ నంబర్ చూసి చేశారట! వచ్చి బాడీని కలెక్ట్ చేసుకోమంటున్నారు. "ఈయనగారు అక్కడికెందుకు వెళ్ళినట్టో" అంది పెద్దకోడలు కాస్త వెటకారంగా. "ఆఁ ఏముంది షిరిడీ వెళ్ళాలని తీసుకున్న టికెట్ రోజు చూసుకొని ఏడ్చేవారుగా అవి తీసుకువెళ్ళినట్టుంది" అని జవాబు ఇచ్చింది తోడికోడలు.

"అదిసరే... మరిపుడు ఏం చేద్దాం!?" అని తమ్ముడ్ని అడగ్గానే భార్యవైపు చూశాడు ఏం చేద్దామన్నట్టుగా. నలుగురు ఆలోచనలో పడిపోయారు. తండ్రి చనిపోయినందుకు ఓ పక్క ఆనందంగా ఉంది. ఎందుకంటే బ్రతికుండగా ఆస్తి పంపకం ఎలాగూ జరగనివ్వడనీ, మరోపక్క కాసింత బాధ ఉంది కన్న తండ్రి పోయాడని. వెళ్ళాలా! వద్దా!? అనే ద్వైద్వీ భావనలో పడిపోయారు. అప్పటికి అరగంటదాటినా వారి ఆలోచనలు ఒక కొలిక్కిరాలేదు. వెళ్ళాలా! వద్దా! అనే విషయంలో. పెద్దకోడలు ఒక్కసారిగా "ఏమండీ!" అని గావు కేకవేసింది. అందరూ ఆమె వైపు తిరిగారు. నోరుతెరచి టీవీ స్క్రీన్‌ని చేయితో చూపించింది. న్యూస్‌కి సంబంధించిన హెడ్‌లైన్స్ వస్తున్నాయి. "తెల్లవారు ఝామున జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మరణించిన వారికి లక్ష రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు కేంద్ర రైల్వేమంత్రి" అన్నదమ్ములిద్దరికీ 'నాన్నా'అని ఉప్పెనలా దుఃఖం తన్నుకొచ్చింది. వారిద్దరూ బయలుదేరటానికి కావల్సినవి సర్దటానికి లోనికెళ్ళారు.

◆



భాష-సంస్కృతి-ఉద్యమం

జనసాహితి ప్రచురణ; వెల : రు. 8/-

ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

మాతృభాషను రక్షించుకుందాం

1999 ఆగస్టులో "ప్రజల భాషలో విద్య - పరిపాలన" అనే అంశంపై జనసాహితి తన తొమ్మిదవ రాష్ట్ర మహాసభను హైదరాబాద్‌లో నిర్వహించింది. ఆ సందర్భంగా ఒక అవగాహనా పత్రాన్ని విడుదల చేసి సభలో చర్చించింది. సవరణలు - సూచనల ప్రకారం సరిదిద్దిన పత్రాన్ని, దానికి సహాయకంగా ఉండే మరికొన్ని వ్యాసాలను, కరపత్రాలను కలిపి "ప్రజల భాషలో విద్య - పరిపాలన" అనే పుస్తకంగా విడుదల చేశారు. తదనంతర కాలంలో విడుదల చేసిన "ఆవును చంపి చెప్పులు దానం చెయ్యటం దాతృత్వమూ కాదు. అభివృద్ధీ కాదు.. తెలుగు భాషను ఖూనీ చేసి 'జన్మభూమి'ని రక్షించలేరు", "భాష-సంస్కృతి ఉద్యమం" అనే జనసాహితి వారి రెండు కరపత్రాలు, "మాతృభాషల పరిరక్షణ జాతీయ ప్రజాస్వామిక ఉద్యమంలో అంతర్భాగం కావాలి" అనే దివి కుమార్ వ్యాసం ఇందులో వున్నాయి. వీటితో పాటు మొగలు చక్రవర్తి ఔరంగజేబు 300 సంవత్సరాల క్రితం తన గురువును ఉద్దేశిస్తూ భాష-విద్య-విజ్ఞానం అనే ప్రాముఖ్యం కలిగిన అంశాలపై *హేతుబద్ధమైన ఆలోచనతో రాసిన ఉత్తరం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. సామ్రాజ్యవాదం ఆర్థికంగానే* కాక సంస్కృతి, భాషలు అన్నింటిపై చేస్తున్న బుల్డోజింగ్ దాడిని చిత్రీకరించిన గూగ్ వా థియాంగ్ "భాషా సామ్రాజ్యవాదం" వ్యాసం మనల్ని ఆలోచింప చేస్తుంది. ఈ రెండు వ్యాసాలను కొత్తపల్లి రవిబాబు అనువదించారు. తెలుగు భాషోత్సవ సమాఖ్య చేపట్టిన ఉద్యమాన్ని సిద్ధాంత పరంగా మరింత పటిష్టం చేయడానికి ఈ వ్యాసాలు ఉపయోగపడతాయి.

✻ కె.పి.అశోక్‌కుమార్



హిందీ-తెలుగు శబ్దరత్నాకరము

రచన : వేమూరి రాధాకృష్ణమూర్తి

వెల : రు. 125/-

ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

సమగ్ర నిఘంటువు

ఎంత చదువుకున్న వ్యక్తికైనా తన భాషలోని పదాలకే కొన్నింటికి అర్థాలు తెలియవు. దానికోసం వారు శబ్దకోశాన్ని చూసుకోక తప్పదు. అట్లాంటిది తన భాషకాని ఇతర దేశీయ భాషలు, విదేశీ భాషలలో అనేక పదాలకు అర్థాలు తెలియవు. దానికోసం డిక్షనరీపై ఆధారపడక తప్పదు. హిందీ శబ్ద రత్నాకరం అనేక వేల హిందీ పదాలకు అర్థాలను మనకు అందిస్తుంది. ముఖ్యంగా ఇందులో హిందీ పదాల ఉచ్చారణతో పాటు వాటి తెలుగు అర్థాలను కూడా పొందుపరిచారు. రచయిత కేవలం హిందీ పదాలకు తెలుగు పదాలను అందించడంతోనే ఈ డిక్షనరీని ముగించలేదు... ఇందులో భాషా భాగాలతో పాటు నిత్యజీవితంలో ఉపయోగించే అనేక వస్తువులు, గృహ సంబంధమైన మాటలు. మనలోని భావాలు వంటి వాటిని 36 శీర్షికల కింద విభజించి అందించారు. ఇవేగాక జాతీయాలు, సామెతలు, కొన్ని ఆంగ్ల పదాలకు హిందీ, తెలుగు అర్థాలను కూడా అందించారు. ఈ శబ్దరత్నాకరం విద్యార్థులకు విశేషంగా ఉపయోగపడుతుంది. విద్యార్థులకే కాక ఉపాధ్యాయులు, రచయితలు, జర్నలిస్టులు, అనువాదకులకు కూడా ఈ నిఘంటువు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. హిందీని నేర్చుకుంటున్న వారందరికీ ఇది చాలా ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటిలోనూ, గృహగ్రంథాలయంలోనూ ఉండదగిన నిఘంటువు ఇది. ఇందులో హిందీ పదాల ఉచ్చారణను కూడా చేర్చినందున దీనిని ఉపయోగించుకోవడం చాలా సులభంగా ఉంటుంది. ఇంత సమగ్రమైన నిఘంటువును అందించిన రచయితకు ధన్యవాదాలు చెప్పుకోవాలి.

✻ సింహాద్రి సరోజిని

స్వీకారం

సరియైన ఉచ్చారణ

రచన : సత్తి లలితారెడ్డి; వెల : రు. 15/-

ప్రతులకు : శ్రీమతి సత్తి లలితారెడ్డి, 40-1-35, శ్రీవాణి, కాంధారి దగ్గర, బందర్ రోడ్, విజయవాడ - 10



కదురు

రచన : అంబటి వెంకన్న; వెల : రు. 25/-

ప్రతులకు : గోసంగి ప్రచురణలు, అంబటి వెంకన్న, కేరాఫ్, గురవయ్య, జడ్.పి. ఆఫీస్, నల్లగొండ.; నవోదయ బుక్‌హౌస్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; సహచర బుక్‌హౌస్, హైదరాబాద్

ఫాయిదా

తెలంగాణా సాహిత్య వ్యాసాలు

రచన : గుడిపాటి; వెల : రు.20/-

ప్రతులకు : బి. శకుంతల, 16-11-310/12/ఎ/3, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్-36; డా॥ పులిపాటి గురుస్వామి, హెచ్.నెం. 6-47, బాంక్‌కాలనీ, ఎల్.బి.నగర్, హైదరాబాద్-74

చిన్నప్పటి నుండి రచనలపై అతనికి అమితాసక్తి. ఎందరో రచయితల ప్రేరణతో రచనా వ్యాసంగంపై మక్కువ పెంచుకొని 'సిశ్రీ' పేరుతో రచయితగా గుర్తింపు పొందుతున్న ఆ యువ రచయిత అనుకోని విధంగా ఇంద్రజాల కళాకారుడిగా మారారు. ఆయనే శ్రీనివాస వర్మ. రాష్ట్ర వ్యాపిత మ్యాజిక్ ప్రదర్శనలతో సీనియర్ కళాకారుల సరసన నిలిచిన మేజిక్ శ్రీనివాసవర్మ గురించి ఈవారం తెలుసుకుందాం.



వైవిధ్య ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న శ్రీనివాస్


మేజిక్ చేస్తూ

1977 సంవత్సరం గుంటూరు జిల్లా రేపల్లెలో చల్లగాలి కనకలక్ష్మి, రాజేంద్రప్రసాద్ దంపతులకు జన్మించిన శ్రీనివాస్ బాల్యం, విద్యాభ్యాసమంతా తాడేపల్లి (గుంటూరు జిల్లా) లోనే సాగింది. తొలుత 'ఎక్సరే' సంస్థ ప్రోత్సాహంతో రచనా వ్యాసంగంపై ఆసక్తిని పెంచుకున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా వివిధ పత్రికలకు 'సిశ్రీ' పేరుతో కథలు, కవితలు అందజేశారు. హైస్కూల్ స్థాయిలోనే ప్రముఖ మెజీషియన్ క్రాంతికర్ ప్రోగ్రాం చూసి స్ఫూర్తినొందిన శ్రీనివాస్ మ్యాజిక్ కళపై ఇష్టాన్ని పెంచుకున్నారు. ఆ నేపథ్యంలో ప్రముఖ మెజీషియన్ 'భయంకర్' ఇంద్రజాల కళలో ఓనమాలు దిద్ది ఇంద్రజాల కళాకారుడిగా ప్రదర్శనలివ్వడం మొదలెట్టారు. 1995 సంవత్సరం నుండి ఒక పక్క రచనలు చేస్తూనే మరోపక్క మెజీషియన్‌గా రాణిస్తున్న శ్రీనివాస్‌వర్మ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో చేస్తున్న చిరు ఉద్యోగాన్ని సైతం వదులు కోవడం విశేషం.

వైవిధ్య ప్రదర్శనలకు పెట్టింది పేరు

అబ్రకదబ్ర అంటూ గాల్లో పూలగుత్తులు సృష్టించడంలాంటి సాధారణ అంశాలతో పాటు ట్యూబ్‌లైట్లను పరపరా కొరికేయడం, బ్లేడులు, గాజు గ్లాసులు, గుండుసూదులు మింగేయడం, నోట్లో కిరసనాయిల్ పోసుకొని నిప్పంటించుకోవడం వంటి వళ్ళు గగుర్పాటు కలిగించే అంశాలను ప్రదర్శించడంలో శ్రీనివాస్ అందవేసిన చేయి.


హైదరాబాద్ డిజిపి చేతుల మీదుగా మెమెంటో స్వీకరిస్తున్న 'వర్మ'

వందలాది ప్రదర్శనలు, సత్కారాలు

వర్ధమాన కళాకారుడిగా రాష్ట్రవ్యాపితంగా వందలాది ప్రదర్శనలిచ్చిన శ్రీనివాస్ వివిధ చానళ్ళలో పాల్గొని మ్యాజిక్ ప్రదర్శనలిచ్చారు. ఈటీవీ 'హుష్' కార్యక్రమంలో 'ట్యూబ్‌లైట్ల' అంశాన్ని ప్రదర్శించి రాష్ట్రవ్యాపితంగా అభిమానులను సంపాదించుకున్నారు. ఊయల కమ్యూనికేషన్స్, సమైక్యభారతి, ఎక్స్‌రే తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల ద్వారా సన్మానాలు, సత్కారాలు పొందిన శ్రీనివాస్ మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా సామాజిక సందేశాన్ని అందించాలనే సంకల్పంతో కొత్త అంశాలకు రూపకల్పన చేస్తున్నారు. శ్రీనివాస్‌వర్మ భవిష్యత్‌లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

*** చలపాక ప్రకాష్**

ఉదయం పదకొండు గంటలు. అప్పటికే పరిసరాలన్నీ సూర్యుడి కోపానికి సమిధలవుతూ కనిపించని నిప్పుల గుండాలు తయారు చేసి అగ్ని పరీక్ష పెడుతున్నాయి. మోటార్ సైకిల్ మీద వెళుతున్న నాకు 'బావా' అన్న పిలుపు వినబడడంతో ఆగిపోయాను. అది మా రమేష్ గొంతు! వెనక్కి తిరిగిచూస్తే... వాడు నా దగ్గరకి వస్తూ ఉన్నాడు.... రాగానే "ఏంది బావా... నీ కోసం నాలుగు రోజుల నించి చూస్తున్నాను. ఎక్కడికి పోయావు? నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి. రోడ్డు మీదెందుకు గాని... అలా పక్కకెళ్లి మాట్లాడుకుందాం పద..." ఎక్కడా ఆగకుండా చెప్పాడు వాడు. వాహనాన్ని రోడ్డు దించి ఓ కిళ్ళీ కొట్టు నీడలో పెట్టాను.



✻ శాఖమూరి శ్రీనివాస్

జ్యూస్‌స్టాల్

"ఏంటో చెప్పు... అంత అర్జంట్ ఏందో..." నా మాట అయిపోకముందే, "చాలా చాలా అర్జంట్... మన మింతకుముందు ఓ వ్యాపారం చేద్దామనుకున్నాం... గుర్తుందా!" చెప్పాడు వాడు. వాడి మాటలతో ఆ విషయం జ్ఞప్తికొచ్చింది.

"అవును... ఏం..."

"దానికి సంబంధించిన వివరాలన్నీ పట్టుకొచ్చాను. మధ్యాహ్నం నీకు తీరికుంటే ఇంటికొస్తాను... పూర్తిగా చర్చిద్దాం..."

"అలాగే నంటూ కారిపోతున్న చెమటను తుడుచుకోసాగాను. నిజానికి వ్యాపారమంటే నాకు కొంత విముఖత ఉంది. ఎందుకంటే... అందులో ఎక్కువ మంది మోసం చేయడం చిన్నప్పట్నించీ ఎరుగుదును. వ్యాపారం అంటే మోసం తప్పదని అనుకునే వాణ్ణి. అయినా మోసం లేకుండా వ్యాపారం చేస్తే రాబడి తగ్గుతుందేమోగాని నష్టాలు రావు కదా! మంచి పేరొస్తే ఎంత ఆత్మసంతృప్తి! నిజాయితీ గల వ్యాపారస్తులు ఎందుకు లేరు?!....

నా ఆలోచనకు బ్రేక్ వేస్తూ, "బావా... ఎండ ఎక్కువగా ఉంది, ఏదైనా కూల్‌డ్రింక్ తాగుదామా...." అన్నాడు రమేష్.

"కూల్‌డ్రింక్ వద్దులే... అదిగో ఆ బండి దగ్గర జ్యూస్ తాగుదాం పద..." చెప్పాను నేను.

ఇద్దరమూ అక్కడికెళ్లాము. 'రెండు బనానా జ్యూస్ వెయ్యి' మా వాడు ఆర్డరిచ్చాడు. బండికి అరటిగెలలు, వలల్లో మామిడి పండ్లు, ద్రాక్ష, సపోటా.... అన్ని పండ్లు వేలాడదీసి ఉన్నాయి. రాత్రి దాని అందం పెంచేందుకు చిన్న 'సిరీస్ లైట్లు' కూడా అలంకరించి ఉన్నాయి. చక్కగా పంచె కట్టుకుని, ఖద్దరు చొక్కా వేసుకొని ఉన్న అతన్ని వింతగా ఆశ్చర్యంతో చూశాను నేను. బండి దగ్గర వేరే జనాలు ఎవరూ లేకపోవడంతో అతనితో సంభాషణ మొదలు పెట్టాను.

"ఏ ఊరు మీది? .... ఇంతకుముందు ఈ ఊర్లో చూడలేదే!"

"కొత్తగా పెట్టాను సార్... మాది గుడిపాడే!"

గుడిపాడు దగ్గరి ఊరే! సాధారణంగా పల్లెటూరి నించి వచ్చి ఇలాంటి వ్యాపారాలు చేయరు. సాధారణంగా ఇక్కడి నిరుద్యోగ యువతే ఇలాంటివి చేస్తూ ఉంటారు.

"గుడిపాడులో ఏం చేసే వాడివి?" నా ఆతృత ఆపుకోలేక పోయాను.

"రైతును సార్.. వానల్లేక, కరువొచ్చి ఈ వ్యాపారం మొదలు పెట్టాను."

అతని మాటలకు నిర్ఘాంతపోయాను. కరువు తీవ్రత గూర్చి పేపర్లో చదవడమే తప్ప, ప్రత్యక్షంగా చూడని నాలో చిన్న అలజడి మొదలయ్యింది.

"మరి పొలాన్ని ఏం చేశావు?" జ్యూస్ తీసుకుంటూ అడిగాను.

"ఉంది సార్... ఇప్పుడు బీడు పెట్టినా, వానలు పడితే మళ్లీ వ్యవసాయం చేస్తాను."

"నీకీ వ్యాపారం చేయడం ఇబ్బంది అనిపించలేదా?"

'ఇబ్బంది ఎందుకు సార్... హరిశ్చంద్రుడికే తప్పలేదు కష్టాలు. నేనెంత! తప్పు చేయనంత వరకూ ఏ పనైనా నామోషీ కాదుసార్. సిగ్గుపడితే బతికేదెట్లా?'

సమాజం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటోందో కళ్ళ ముందు ప్రత్యక్షమవుతోంది. రైతుల పరిస్థితే ఇలా ఉంటే రైతు కూలీలు, దళితుల పరిస్థితి... జీవితం ఎంత కష్టతరమైంది.

జ్యూస్‌కి రమేష్ డబ్బులిచ్చాడు. చుట్టుముట్టిన ఆలోచనలతో వెనుతిరిగిన మమ్మల్ని ఆపి, జార్‌లో మిగిలిన జ్యూస్‌ని గ్లాసుల్లో సగంసగం పోశాడతడను.

'వద్దులే... ఉంచు... బేరాలొస్తే ఇవ్వొచ్చు కదా..." అన్నాను నేను.

"తీసుకోండి సార్... ఫరవాలేదు.... ఈ గ్లాస్‌తోటే నా వ్యాపారానికి నష్టం రాదులే..." అంటూ చొరవగా గ్లాసులు చేతిలో పెట్టాడతను. బలవంతం చేసినా డబ్బు తీసుకోలేదు!

అతను 'వ్యాపారస్తుడు' కాదు, కాలేదు. సాటి మనిషిపై ప్రేమ, అభిమానం కురిపించే అన్నదాత రైతన్న అతను. ఆప్యాయంగా ఆ జ్యూస్... ఎండన పడి వచ్చిన బాటసారికి చల్లటి మజ్జిగ అందించే పల్లెటూరి ప్రేమను గుర్తుకు తెచ్చింది. ఇతన్నెందుకు స్ఫూర్తిగా తీసుకోకూడదు! చేసే పనేదైనా మానవతా మూలాలు మర్చిపోని స్థితే మనిషి అస్తిత్వానికి పునాది. ఆశావహ దృక్పథంతో, ఆ సంఘటన నించి ఒక మౌలిక జీవిత సత్యాన్ని నేర్చుకున్నానన్న సంతృప్తితో అక్కడ్నించి కదిలివెళ్ళిపోయాను. రమేష్ నన్ను అనుసరించాడు. ◆

ఇది ఇథియోపియా కథకాదు... సోమాలియా వ్యధకాదు. స్వేచ్ఛా భారత స్వర్ణాంధ్రలోని రైతు కుటుంబ యదార్థ గాథ. జయచంద్రకు ఇంట్లో నుండి అడుగు బయటకు పెట్టాలంటేనే చాలా భయంగా ఉంది. తండ్రి ఆదెప్ప ఆత్మహత్య చేసుకొని 20 రోజులవుతోంది. ఆచారం ప్రకారం తల్లిని మేనమామ నిద్రకు తీసుకుపోయాడు. ఏడాది వయసున్న తన కూతురు చెన్నైలోని ఆస్పత్రిలో బ్లడ్ క్యాన్సర్‌తో కొట్టుమిట్టాడుతోంది. భార్య అక్కడే కూతురికి సపర్యలు చేస్తోంది. ఇక్కడ అతన్ని కిడ్నాప్ చేయటానికి గ్రామంలో కొందరు వ్యక్తులు కాపుకాశారు. పగలు ఎవరో ఒకరు వచ్చి ధైర్యం చెప్పి పోతున్నారు. రాత్రవుతుందంటేనే అతను వణికిపోతున్నాడు. అతను హంతకుడు కాదు... ఏ నేరమూ చేయలేదు... ఎందుకు భయపడుతున్నాడు?...

సొంత ఇంట్లోనే ఖైదీగా...



అసలు కథ ఇక్కడే ప్రారంభమైంది.

* అమృత

అది అనంతపురం జిల్లాలోని ఓ.డి చెరువు మండలం. మేము అక్కడి నుండి డబురువారిపాలెంకు చేరుకొని జయచంద్ర ఇంటి అడ్రస్ అడిగాము. 'ఎందుకు? మీరెవరు? ఏం పని?'... ఇలా ప్రశ్నల పరంపరలు ఎదురయ్యాయి. జయచంద్ర ఇంటికి అక్కడి వాళ్ళు రక్షణగా నిలబడ్డారు. మేము పాత్రికేయులమని, అప్పుల బాధ భరించలేక ఆత్మ హత్యకు పాల్పడిన రైతు వివరాలు తెలుసుకోటానికి వచ్చామని చెప్పాం. అక్కడి వారు వెంటనే ఇంట్లోకి ఆహ్వానించారు. జయచంద్ర ప్రాణభయానికి కారణమడిగితే గ్రామస్తులు వాస్తవ కథను వివరించారు.

రైతు ఆదెప్పకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 12 ఎకరాల భూమి, ఉండటానికి ఇల్లు, పిల్లాపాపలతో సంతోషంగా సాగిపోతోంది అతని సంసారం. వర్షాలు లేక ఏడేళ్ళ కిందట ఆదెప్పకు కష్టాలు మొదలయ్యాయి. భార్యను కూడా కూలికి పంపించాడు. బోరు వేయిస్తే సమస్య తీరిపోతుందని బంధువులు సలహా ఇవ్వడంతో తండ్రీకొడుకుల పేరున 90 వేల రూపాయలు బ్యాంకులో అప్పు తీసుకున్నాడు. వచ్చిన డబ్బుతో పనులు ప్రారంభించాడు. పొలంలో 360 అడుగుల లోతున బోరు వేయించినా నీళ్లు పడలేదు. పాతిక వేల రూపాయలు ఖర్చయ్యాయి.

'360 అడుగుల లోతు వరకు ప్రయత్నించారుగా... మరో ప్రయత్నం చేసి చూడండి. ఇంకో 150 అడుగులు వేస్తే నీళ్ళొచ్చే అవకాశం ఉంది. ఫలానా, ఫలానా వాళ్ళకు నీళ్ళు పడ్డాయి'... అంటూ గ్రామస్తులు సలహా ఇచ్చారు. వారి మాట కాదనలేక రెండవ సారి 500 అడుగుల లోతు వరకు ప్రయత్నించారు. 60 వేల రూపాయలు ఖర్చయ్యాయే తప్ప చుక్క నీరు రాలేదు. వర్షాధారం మీద భూమి సాగుచేయడంతో ప్రతి ఏడాదీ పంట సాగుచేయటానికి 20 వేల రూపాయలు ఖర్చయ్యేది. ఈ విధంగా ఆరు సంవత్సరాలుగా పంటలేదు. మధ్యలో కొడుకు పెళ్ళి చేసి కట్నం తీసుకున్నా, అవీ కరువు దెబ్బకు స్వాహా అయ్యాయి.

ఇక్కడ బతకడం కష్టమని కొడుకు కుటుంబాన్ని, కుమార్తెను బెంగుళూరు పంపించాడు. ఏడవ తరగతి చదివిన ఆదెప్ప కొడుకు జయచంద్రకు చిన్న పని దొరికింది. అతని చెల్లి టైలరింగ్ చేసేది. కష్టాలు తీరాయి అనుకొంటుండగా, జయచంద్ర కుమార్తె జబ్బుపడింది. బెంగుళూరు ఆస్పత్రిలో చూపించినా బాగుపడలేదు. అక్కడి నుండి తిరుపతి తీసుకు వెళ్ళారు. అక్కడి డాక్టర్లు పరీక్షచేసి ఆ చిన్న బిడ్డకు బ్లడ్ క్యాన్సర్ అని చెప్పారు. చెన్నై తీసుకుపోతే బతికి బయటపడగలదన్నారు. భార్యా బిడ్డను తీసుకొని చెన్నైలోని ఎగ్మూర్ ఆస్పత్రికి వెళ్ళాడు. కూతుర్ని బతికించుకోవడానికి అందిన చోట అందినంత అప్పు తెచ్చి బిడ్డకు వైద్యం చేయిస్తున్నాడు.

ఇక్కడ గ్రామంలో ఆదెప్ప పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఏమీ లేదు. బ్యాంకులో తీసుకున్న అప్పు ఇప్పుడు లక్షా 80 వేల రూపాయలు అయ్యింది. బ్యాంకువాళ్ళు నోటీసులపైన నోటీసులు ఇస్తున్నారు. ఇదికాక గ్రామంలో కొంత అప్పుచేశాడు. వాళ్ళిప్పుడు పీడిస్తున్నారు. వీటికితోడు పెళ్ళికి ఎదిగిన కూతురు ఉంది. ఆదెప్ప పరిస్థితి తెలిసి కూడా 'కూతురి పెళ్ళి చేయవా'... అని గ్రామస్తులు, బంధువులు అడుగుతుంటే కుమిలిపోయేవాడు. దీనికి తోడు అప్పుల వాళ్ల బెడద ఎక్కువైంది. ఎక్కడ కనిపిస్తే అక్కడ అడుగుతున్నారు. పరువు తీస్తున్నారు. గతంలో ఎకరం పాతిక వేల రూపాయలున్న పొలం ఇప్పుడు ఆరు వేలకే అమ్ముతామని చెప్పినా కొనేవారు కరువయ్యారు. ఒకదాని తర్వాత ఒకటి అన్ని సమస్యలూ ఆదెప్పను గుక్కతిప్పుకోనివ్వలేదు. వీటన్నింటి నుండి బయటపడాలంటే ఒకటే మార్గం అనుకొన్నాడు. ఏప్రిల్ 12న ఉగాది రోజున కదిరి దగ్గరి కుమ్మరివారి చెరువులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజులకు మృతుని జేబులో ఉన్న పాల డైరీలోని వివరాలు చూసి పోలీసులు ఆదెప్పగా గుర్తించారు. పొరుగు రాష్ట్రంలో ఉన్న కొడుకు జయచంద్ర వచ్చేప్పటికి చివరి చూపు కూడా దక్కలేదు. తొమ్మిదవ రోజున పెద్దకర్మ చేశారు.

ఆదెప్ప కర్మకాండలు ముగిసిన తరువాత ఊళ్లోని కొందరు పెద్దలు జయచంద్రను వాళ్లింటికి పిలిపించుకొన్నారు.

'మీ నాయన 50 వేలు అప్పుచేశాడు. నువ్వు చాలా బాధల్లో ఉన్నావు. అప్పు ఇప్పుడు తీర్చొద్దు తర్వాత నిదానంగా తీర్చుదువుకాని, ప్రామిసరీ నోటు మీద సంతకం చెయ్యి' అన్నారు.

'అప్పు తీసుకొన్న సమయంలో సాక్షులెవరు' అని జయచంద్ర బంధువులు అక్కడి వారిని అడిగారు.

ఆ పెద్దలు 'మా పాలేరు సాక్షి సంతకం చేశాడు'... అని చెప్పారేకానీ ప్రామిసరీ నోటు మాత్రం చూపించలేదు.

జయచంద్ర సంతకం చేయనని మొరాయిస్తే, కట్టేస్తామని బెదిరించారు. అక్కడి నుండి జయచంద్ర పరుగుతీశాడు. అక్కడి పెత్తందార్ల బంట్లు వెంటపడ్డారు. గ్రామస్తుల సాయంతో జయచంద్ర అక్కడి నుండి తప్పించుకున్నాడు.

'ఇవాళ్ళ కాకపోతే రేపు పట్టుకుంటాం జయచంద్ర ఊరొదిలి పారిపోలేడు'... అంటున్నారు అక్కడి పెద్దలు.

అప్పటి నుండి జయచంద్ర భయపడిపోతున్నాడు. ఇంట్లో నుండి కాలు బయటపెట్టడంలేదు. కొత్తవారు ఎవరైనా వస్తే అనుమానిస్తున్నాడు.

'రైతు పరువు కోసం పాకులాడతాడు. అందువల్లన్నే రాష్ట్రంలో ఇన్ని ఆత్మహత్యలు జరుగుతున్నాయి. పెద్దల ఒత్తిడి భరించలేక రేపు నేను సంతకం చేసినా ఆశ్చర్యం లేదు'... అంటాడు జయచంద్ర. ◆

✻ కొండబాబు

ఉడతాసాయం..

జోలె పట్టి ఆయన వడివడిగా నడుస్తున్నాడు. ఆయనతో మరికొందరు.

రోడ్డుపై ఆయన్ను గుర్తుపట్టిన వారు ఆయన గురించి చెప్పుకుంటూ.. జేబులో నుంచి తోచినది తీసి సాయం చేస్తున్నారు. ఆయనొక పార్టీ నాయకుడు.

ఆకలి మంటలతో అల్లాడుతున్న కరువు జనం కోసం ఆ పార్టీ అంబలి కేంద్రాలను తెరిచింది. ఇంకా తెరవడానికి పార్టీ ప్రజాసాయం కోసం భిక్షాటనకు పిలుపునిచ్చింది. దీంతో, సాక్షాత్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జోలె పట్టి భిక్షాటనకు బయలుదేరారు.

రోడ్డు పక్క బైకు మీద కూర్చున్న ఓ యువకుడు తన ఏడేళ్ల కూతురికి నడిచొస్తున్న ఆ నాయకుడిని చూపించి... "ఆయన గొప్ప నాయకుడు" అని చెప్పాడు. పేద ప్రజల కోసం భిక్షాటన చేస్తున్న విషయాన్ని చెప్పాడు. ఆ పాప కళ్లింత చేసుకుని.. ఇంకా అడిగి తెలుసుకుంటోంది ఆయన గురించి. ఈ లోగా ఆ నాయకుడు తమను సమీపించగానే, ఆ యువకుడు తన జేబులోంచి వంద రూపాయల నోటు తీసి జోలెలో వేసి, నమస్కారం పెట్టాడు.

వెంటనే ఆ పాప, "డాడీ! నా ఐస్‌క్రీం డబ్బులూ వేస్తాను" అనగానే "వెరీగుడ్" అన్నాడా యువకుడు. ఆ పాప పది రూపాయల నోటు వేయగానే ఆయన పాప బుగ్గలు పుణికి ముందుకు సాగాడు. అది చూసి రోడ్డుపక్క కూర్చున్న ఒకాయన "ఉడతాభక్తి.. ఉడతాసాయం.." అని వ్యాఖ్యానించాడు. పాపను చూసిన మరికొందరు తమ స్తోమతు మేరకు తామూ ఎంతో కొంత జోలెలో వేయసాగారు.

***

ప్రస్తుతం రాష్ట్రంలోని ఒక వాస్తవానికి చిత్రణ ఇది. రాష్ట్రంలో కరువు, పాలకుల నిర్లక్ష్యం, వైఫల్యం, వామపక్షాల సాయం గురించి తెలిసిందే. ఆ విషయాలను గాక, సన్నివేశంలోని "ఉడతాసాయం" అనే జాతీయం గురించే మన చర్చ.

ఉడతాభక్తి, ఉడతాసాయం అనే జాతీయాలు రామాయణ కావ్యమంత పాతవి తెలుగునాట. రామాయణ కథలో రాముడు లంకను చేరుకోడానికి సముద్రంపై వారధి నిర్మిస్తుంటాడు వానరుల సాయంతో. అది చూసిన ఒక ఉడత రాముడికి సాయం చేయాలన్న తలంపుతో తనూ పనిలోకి దిగుతుంది. వానరాలు పెద్ద బండరాళ్లతో వారధి కడుతుంటే, ఉడత సముద్రపు నీటితో తోకను తడుపుకుని, ఇసుకలో దొర్లి, తోకకు అంటుకున్న ఇసుకను వారధి నిర్మాణంలో కలుపుతుంటుంది. అంటే తను చేయగలిగిన మేర ఆ ఉడత సాయం చేసిందన్నమాట.

ఆ కథలోని ఈ ఘట్టం నుంచే "ఉడతాసాయం" అనే జాతీయం పుట్టుకొచ్చింది. ఇలా జంతు సంబంధ జాతీయాలు తెలుగులో కోకొల్లలు. వేర్వేరు వ్యవహారాలలో నుంచి పుట్టిన అవి వేర్వేరు నిర్వచనాలనిస్తాయి.

గాడిద గుడ్డు, అచ్చోసిన ఆంబోతు, దున్నపోతు చర్మం, గ్రామసింహం, కడుపులో ఎలుకలు పరుగెత్తడం, ఐరావతం, కామధేనువు, వంటింటి కుందేలు, కాలుగాలిన పిల్లి, మొసలి కన్నీరు... ఇవన్నీ జంతు సంబంధమైనవే. అలాగే జంతు, పశు వ్యవహారసంబంధంగా ఉండేవీ ఉన్నాయి. కోటికి పడగలెత్తు, తల ప్రాణం తోకకు, మేకపోతు గాంభీర్యం, కొమ్ములు తిరిగినవాడు, మేక వన్నె పులి లాంటివి.

వీటిలో కొన్నింటి గురించి చర్చించుకుందాం. "గాడిద గుడ్డు" అనేస్తుంటారు. గాడిద గుడ్డు పెడుతుందా? పెట్టదు కదా! 'ఏమీ లేనిదని' తృణీకారంతో చెప్పడానికి జన వ్యవహారికంలో "గాడిద గుడ్డు" అనే ప్రయోగం చేస్తుంటారు. ఏమీ లేనిదాని గురించి చెప్పడానికి ఇది చమత్కారయుతంగా ప్రారంభమైంది.

"అచ్చోసిన ఆంబోతు" గురించీ, అదెలా వచ్చిందో కూడా చాలామందికి తెలుసు. గ్రామాల్లో సమాజ అవసరాల కోసం.. శివాలయం నందీశ్వరుడు పేరిట, అలాగే పునరుత్పత్తి ప్రక్రియల కోసం బలమైన ఎద్దులను వదిలేస్తుంటారు. వాటికి శాస్త్రోక్తంగా ముద్రలు వేసి గ్రామాల్లో వదిలేస్తారు. అవి ఏ చేలో బడితే ఆ చేలో మేసేస్తుంటాయి. నిరంకుశంగా తిరిగేస్తుంటాయి. ఇవి కొండొకచో ఇబ్బందులు కలుగజేస్తుంటాయి. ఈ ఇబ్బందులలోంచే బాధ్యతారహితంగా.. ఇష్టమొచ్చినట్లు లైంగికేచ్ఛతో తిరిగే యువకులను "అచ్చోసిన ఆంబోతు" అని తిడుతుంటారు. అంటే ఈ జాతీయం ఒక తిట్టుగా మారిపోయిందన్నమాట.

ఇక గ్రామసింహం గురించి చెప్పుకుందాం. గ్రామసింహం అంటే ఏమిటనుకున్నారు? కుక్క. ఎవరినైనా ఎకసెక్కెం చేయడానికి "మీకేమండీ మీరు గ్రామసింహం"లాంటి వారు అంటారు. దాని అర్థం తెలిస్తే అతగాడు ఉడుక్కోవడమో, కోపగించుకోవడమో చేస్తాడు. అర్థం తెలియకపోతే తనను "గ్రామానికే సింహం" అని పొగిడారనుకుని పొంగిపోతాడు.

గ్రామాల్లో ఎక్కడేం జరిగినా వాలిపోయి, లబ్ధి పొందాలని చూసే "కొందరు పెద్ద మనుషులు"ంటుంటారు. అలాంటి వారినుద్దేశించి కూడా గ్రామసింహాలు అని కామెంట్ చేయడం పరిపాటి. ఇక 'దున్నపోతు చర్మా'ల గురించి చెప్పనవసరంలేదు. చాలామందికి తెలుసు. దున్నపోతు చర్మం చాలా దళసరట. దానికి సాధారణమైన దెబ్బలతో చురుకెక్కదని చెపుతారు. అందుకే 'దున్నపోతు మీద వాన కురిసినట్లు' అనే పలుకుబడి పుట్టింది. ఒక పట్టాన ఏ విషయాన్నీ ఎక్కించుకోని వాళ్లను 'వాడొక దున్నపోతు' అనేస్తుంటారు. పశు, జంతు సంబంధ జాతీయాలు మరికొన్నింటి గురించి వచ్చే వారం చర్చించుకుందాం. ◆

పాఠక స్పందన

కవర్ స్టోరీ బాగుంది

18వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ చాలా బాగుంది. ముఖ్యంగా టెలిఫోన్ ఎప్పుడు ఆవిర్భవించింది, ఇంతకుముందు సమాచార వ్యవస్థ ఎన్నెన్ని రకాలుగా పని చేసేదో చాలా చక్కగా వివరించారు. తెలియని చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాము.

-అరుణ, విజయవాడ

అర్థవంతంగా 'తిరిగి వచ్చిన వసంతం'

11వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రియల్ స్టోరీ 'తిరిగి వచ్చిన వసంతం' కన్న మమకారానికి, ఉన్న సంస్కారానికి అర్థం చెప్పే విధంగా ఉంది. మోడు వారిన వృక్షం తిరిగి చిగురించినంత ఆనందాన్ని కలిగించింది. ఇంత మంచికథ నిజంగాకన్నులకు కట్టినట్లుగా, గుండెల్లో గూడు కట్టుకున్నట్లు ఉండడం మా కెంతో నచ్చింది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

ఆసక్తి దాయకం కవర్ స్టోరీ

11వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ ఆసక్తి దాయకంగా ఉంది. అలాగే కవర్ డిజైనింగ్ కూడా చాలా ఆకర్షణీయంగా ఉంది. ఆడపిల్ల అని తెలియగానే పుట్టకముందే ఎలా చంపేస్తున్నారో చాలా చక్కగా వివరించారు. అలాగే రియల్ స్టోరీ కూడా చాలా బాగుంది. తల్లిచనిపోవడం, తండ్రి వేరే పెళ్ళి చేసుకోవడం, అక్కను హాస్టల్‌లో చేర్పించి ఉమేష్ కాఫీ అమ్మడానికి కుదరడం నా మనుస్సును కదిలించింది.

-ప్రతిభ, శాలిగౌరారం, లక్ష్మయ్య, హైదరాబాద్

With Best Compliments

VASANT CHEMICALS LIMITED

Manufactures & Exporters of Dye Intermediates

(A Recognized Export House)
(An ISO 14001 Company)

Registered Office :
2B, Varun Towers, II Floor, Begumpet,
HYDERABAD - 500 016., INDIA.
Tel : +91-40-7762653, 7762663, 7762467, 7762276, 7760905
Fax : = 91-40-7767940, 7767246
E-Mail : vasant@hdl.vsnl.net.in

With Best Compliments

GOLDEN PRAWNS PVT. LTD.

Opp. Karvy House,
Road No. 10, Banjara Hills,
Hyderabad - 34.
Ph : 6660408, 3350940

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది